ప్రజాశక్తి

ఆదివారం 12 నవంబర్ 2023 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

లైసెన్స్ లేకుండా విక్రయిస్తే చర్యలు

- నిబంధనలకు లోబడే బాణసంచా అమ్మాలి
- ఎస్‌పి మల్లికగర్గ్

ఎస్‌పి మల్లికగర్గ్

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

లైసెన్సులు లేకుండా ఎవరైనా టపాసులు తయారుచేసినా, నిల్వ చేసినా, అమ్మినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ మల్లికగర్గ్ హెచ్చరించారు. జిల్లాలో బాణసంచా విక్రయాలు లైసెన్సు కల్గిన దుకాణాల్లో మాత్రమే ప్రభుత్వ నియమ నిబంధలనకు లోబడి అమ్మాలని, బాణాసంచా లైసెన్సుదారులు బహిరంగ ప్రదేశాల్లో నిర్ణీత కొలతల మేరకు ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేసుకోని విక్రయించుకోవాలని చెప్పారు. షాపుల వద్ద నీరు, ఇసుక, తదితర అగ్నిమాపక సామాగ్రిని తప్పనిసరిగా టపాసుల విక్రయ దుకాణాల్లో సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. బాణసంచా దుకాణాలకు దూరంలో వాహనాలను నిలుపుకునేలా చూసుకోవాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా బాణసంచా అక్రమ విక్రయాలు, నిల్వల సమాచారాన్ని ఉంటే పోలీస్ డయల్ 112 లేదా పోలీస్ వాట్సాప్ నెంబర్ 91211 02266 లకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

దీపావళి పర్వదినాన్ని జిల్లా ప్రజలు అందరూ ఆనందంగా జరుపుకోవాలని, ఈ దీపావళి చీకట్లను పారదోలి ప్రజల జీవితాల్లో మరిన్ని దీపావళి పర్వదినాన ఆనవాయితీగా వచ్చే బాణ సంచాలను కాల్చే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పిల్లలు పట్ల అప్రమత్తంగా ఉండాలని, పిల్లలు టపాసులు కాల్చే సమయంలో పెద్దల పర్యవేక్షణ ఉండాలని ఎస్పీ సూచించారు.

చోరీ జరిగిన ఇంటిలో పరిశీలిస్తున్న పోలీసులు

పేరాలలో రెండు చోరీలు

- 460 గ్రాముల బంగారం, రూ.7 వేల నగదు అపహరణ

3లో ▲

పెద్దల చేతుల్లోనే అసైన్డ్ భూములు

- అధిక శాతం భూములు అన్యాక్రాంతం
- బాపట్ల జిల్లాలో 22,998 ఎకరాలకు పేదల వద్ద ఉంది 2,917 ఎకరాలే..

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాలో రెండు దశాబ్దాల క్రితం పేదలకు పంపిణీ చేసిన భూముల్లో అధిక శాతం గ్రామాల్లో ఉన్న పెద్దలు, పెత్తందార్లు చేతుల్లోకి వెళ్లిపోయినట్లు స్పష్టమవుతోంది. గతంలో పేదలను ఆదుకునేందుకు, వారు తమ గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూముల్లో సేద్యం చేసుకుంటూ కుటుంబ జీవనం సాగించేందు కోసం ప్రభుత్వాలు అసైన్డ్ భూములను పంపిణీ చేశాయి. కాలక్రమంలో సదరు భూములు చేతులు మారి అన్యాక్రాంతమైన పరిస్థితులున్నాయి.

ఈ నేపథ్యంలో జిల్లాలో 20 ఏళ్ళ క్రితం ప్రభుత్వం ద్వారా అసైన్డ్ భూములను పొంది బి-ఫారాలు కలిగి ఉన్న పేదలైన వాస్తవ లబ్ధిదారుల స్వాధీనంలో ఉన్న భూములపై పూర్తి హక్కులు కల్పి స్తామని రాష్ట్రప్రభుత్వం ప్రకటిం చింది. ఇందుకోసం 9/23 ఆర్డినెన్స్‌ను తెచ్చింది. ఈ మేరకు గతంలో పేదలకు పంపిణీ చేసిన భూముల వివరాలను రెవెన్యూ అధికారులు గ్రామాల వారీగా సర్వే జరిపారు. సదరు భూములు ప్రస్తుతం వాస్తవంగా ఎవరి అధీనంలో ఉన్నాయో పరిశీలనలు చేశారు. బాపట్ల జిల్లాలో ఉన్న 25 మండల్లాలో 16 మండలాల్లో మాత్రమే గతంలో పంపిణీ చేసిన అసైన్డ్ భూములు పేదల అధీనంలో ఉన్నట్లు సర్వేలో తేలింది. 16 మండలాలకు సంబంధించిన 66 గ్రామాల్లో గతంలో 22,998 ఎకరాల 89 సెంట్ల భూములను పేదలకు పంపిణీ చేయగా ఇప్పుడు జరిపిన సర్వేలో 2,917 ఎకరాలా 28 సెంట్ల భూమి మాత్రమే పేదల స్వాధీనంలో ఉన్నట్లు తేల్చా రు. అంటే 20 వేల ఎకరాలు అసైన్డ్ భూములు అన్యాక్రాంతమై పెద్దల చేతుల్లోకి వెళ్లినట్లు తేలింది. దీంతో గతంలో వందలాదిగా ఉన్న పేదలైన అసైన్డ్‌దారులు భూములపై హక్కులు కోల్పోయినట్లయింది. ప్రస్తుతం రెవెన్యూశాఖ తేల్చిన లెక్కల ప్రకారం జిల్లాలో 2,917 ఎకరాల అసైన్డ్ భూమిపై 2,510 మంది పేదలు మాత్రమే హక్కు కలిగి ఉన్నారు. ఇందులో చీరాల మండలంలో గతంలో 5,639 ఎకరాల అసైన్డ్ భూమి పేదల చేతిలో ఉండగా ప్రస్తుతం 56 ఎకరాలు మాత్రమే అసైన్డ్ దారుల చేతుల్లో ఉంది. రేపల్లె మండలంలో గతంలో 5,723 ఎకరాలు

▶ 2లో

బాపట్ల జిల్లాలో అసైన్డ్ భూముల వివరాలు

మండలం	గ్రామాలు	అసైన్డ్ భూమి (ఎకరాల్లో)	హక్కు కల్పించడానికి గుర్తించింది.. (ఎకరాల్లో)
అద్దంకి	9	643.002	138.142
ఇంకొల్లు	2	34.34	4.85
కారంచేడు	3	518.05	15.15
కోరిశపాడు	7	92.012	167.1405
చినగంజాం	1	911.374	2.204
చీరాల	3	5639.013	56.835
జె పంగులూరు	9	1562.951	205.989
బల్లికురవ	10	1617.8795	943.024
వేటపాలెం	5	2891.94	365.9775
కర్లపాలెం	2	789.3	4.12
పర్చూరు	5	407.597	50.514
మార్టూరు	1	2.323	1.558
యద్దనపూడి	4	337.498	79.689
చెరుకుపల్లి	1	9.82	2.3
నిజాంపట్నం	1	1618.26	174.25
రేపల్లె	3	5723.535	705.5375
	66	**998.8945**	**2917.2805**

కరువుపై పాలకపక్షం మౌనం

- మంత్రి, ఎమ్మెల్యేలకు పట్టని రైతుల దైన్యం
- శాస్త్రవేత్తల సర్వేలో ఆందోళనకర పరిస్థితులు
- సహాయక చర్యలు చేపట్టకుంటే భవిష్యత్ ప్రమాదకరం

అర్ధవీడులో ఎండుతున్న మిర్చి పంట

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

జిల్లాలో కరువు పరిస్థితులపై పాలకపక్షం మౌనం దాల్చింది. మనకెందుకనే భావనలో ఉన్నారు. మంత్రి మొదలు అధికారపార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందరూ కరువుపై స్పందించలేదు. రాష్ట్రంలో కరువు ప్రకటించారు. వాస్తవానికి ప్రస్తుతం రాష్ట్రంలో అన్ని విధాలుగా వెనుకబడిన జిల్లాగా ప్రకాశమే ఉంది. అయితే జిల్లా అధికారులు పంపిన నివేదికల ప్రకారం 28 మండలాలను కరువు కింద ఖరారు చేయాల్సి ఉంది. కరువు కింద ప్రకటిస్తే అనేక రకాలుగా రాయితీలు, సహాయకచర్యలు చేపట్టాల్సి ఉంటుంది. దీంతో ఆర్థిక భారమనే భావనతో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో ఒక్క మండలాన్ని కూడా గుర్తించలేదు. ఫలితంగా రైతులకు తీవ్ర నష్టం జరుగుతోంది.

జిల్లా అధికారులను పంపిన నివేదికలను బట్టి కరువు కింద కనీసం అవకాశం ఉన్న మేరకు మండలాలను ప్రకటించాలనే ఒత్తిడి కూడా చేసిన దాఖలాల్లేవు. మంత్రి గానీ, ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు గానీ కనీసం పట్టలేదు. జడ్పీ వంటి జిల్లాస్థాయి సమావేశాల్లో మాత్రం గొంతెత్తి అరుస్తుంటారు. రాష్ట్రస్థాయిలో ఎక్కడా మాట్లాడే పరిస్థితి లేదు. వ్యవసాయశాఖ పంపిన నివేదికలను కనీసం కదిలించినా కరువు కింద కొన్ని మండలాలైనా వచ్చేవంటున్నారు. ఎవరూ పట్టించుకోలేదు. పార్టీలో అంతర్గత కుమ్ములాటలు, టిక్కెట్లకోసం పొట్లాటలు, ప్రతిపక్షాలపై రెండ్రోజులకోసారి మీడియా సమావేశాలు పెట్టి ధ్వజమెత్తడాలు తప్ప పాలక పక్షం ఇతర సమస్యలపై ఏమాత్రం దృష్టిసారించిన దాఖలాల్లేవు. బటన్ నొక్కుడు కార్యక్రమాలు తప్ప మిగతావేవీ పట్టడం లేదు. మంత్రి ఆదిమూలపు సురేష్ జిల్లా అధికారులతో కనీసం సమీక్ష కూడా చేయలేదంటున్నారు. కరువు పరిస్థితులు తీవ్రంగా ఉంటే ప్రత్యామ్నాయాలపై చర్చ సాగాలి. ఎమ్మెల్యేలతోనూ సమావేశమై ఏం చేయాలనే దానిపై చర్చ నడపాలి. అధికారుల నుంచి కూడా నివేదికలు తెప్పించాలి. మరోవైపు సాగునీరు కూడా లేదు. ఆరుతడి పంటలకు ఏం చేయాలనేది స్పష్టత లేదు. సాగర్ నీరు రానందున ఆయకట్టులో సుమారు 4.50లక్షల ఎకరాల్లో పంటల పరిస్థితి అయోమయంలో పడింది. పొగాకు నాట్లు వేయాలా? వద్దా.? అనే సందిగ్ధంలో రైతులున్నారు. చాలా ప్రాంతాల్లో నాట్లు లేవు. మొన్న కురిసిన వర్షాలకు కొన్ని ప్రాంతాల్లో నాట్లు వేశారు. తర్వాత ఆరుతడికి నీరు ఎలా అనే ఆందోళన రైతులకు తప్పడం లేదు. వీటిపై కనీసం ఏం చేయాలనే చర్చ పాలకపక్షంలో

▶ 2లో

ఉన్నత స్థానానికి ఎదిగేందుకు విద్యే కీలకం

- విద్యారంగ అభివృద్ధికి ఆజాద్ కృషి
- జేసీ కె.శ్రీనివాసులు
- ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి

అబుల్ కలాం ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేసీ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పేదరికాన్ని అధిగమించడానికి, సమాజంలో ఉన్నత స్థానానికి ఎదగడానికి విద్యే కీలకమని సంయుక్త కలెక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. ఈ దిశగా స్వతంత్ర భారతావనిలో విద్యా రంగ వద్ధికి కషి చేసిన గొప్ప వ్యక్తి భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని ఆయన కొనియాడారు. తొలుత పాత కూరగాయల మార్కెట్ సెంటర్ లోని అబుల్ కలాం విగ్రహానికి ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఇతర ఉన్నతాధికారులు, ముస్లిం మత పెద్దలు పూల మాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం అబుల్ కలాం 136వ జయంతిని పురస్కరించుకొని శనివారం జిల్లా. మైనారిటీ సంస్థ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జెసి మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాట యోధునిగా, స్వతంత్ర భారత దేశానికి తొలి విద్యాశాఖా మంత్రిగా అబుల్ కలాం విశేష సేవలు అందించారని కొనియాడారు. అబుల్ కలాం జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన వ్యాస రచన పోటీలలో విజేతలైన విద్యార్థులకు ఈ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర టైలర్స్ కోఆపరేటివ్ ఫెడరేషన్ ఛైర్‌పర్సన్ సుభాన్‌బీ మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్లు షేక్ నీలోఫర్, షేక్ మహబూబ్ భాషా, రాష్ట్ర ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ లింగంగుంట రవిబాబు, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి సురేష్ ఖన్నా, జిల్లా మైనారిటీ కార్పొరేషన్ ఈడీ ధనలక్ష్మి, వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అర్చన, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు ఆదాం షరీఫ్, పలువురు మైనారిటీ మత పెద్దలు పాల్గొన్నారు.

పెద్దల చేతుల్లోనే అసైన్డ్ భూములు

(మొదటిపేజీ తరువాయి)

పేదల చేతిలో ఉండగా ప్రస్తుతం 705 ఎకరాలు మాత్రమే అసైన్డ్‌దారుల స్వాధీనంలో ఉంది. వాస్తవంగా అసైన్డ్ భూములను అమ్మడం, కొనడం చట్టవిరుద్ధం. కానీ గ్రామాల్లో ఉన్న పెద్దలు, పెత్తందార్లు పేదల అవసరాల కోసం కొంత సొమ్ము ఇచ్చి తరువాత సదరు అప్పు తీరలేదని వారి వద్ద ఉన్న భూములను తీసుకోవడం జరుగుతూ వచ్చింది. కొన్ని చోట్ల అయితే పేదలు తమకు ఇచ్చిన అసైన్డ్ భూములను సాగు చేసుకునే స్థోమత లేక వదిలేయడం ఈ భూములను గ్రామాల్లో ఉన్న పెద్దలు స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఇలాంటి భూములను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకొని అసైన్డ్‌దారుల వారసులు లేదా పేదలకు పంపిణీ చేయాల్సి ఉంది. అసైన్డ్ భూములు పేదల పేరుతో ఉన్నా సదరు భూముల్లో పెద్దలు తిష్టవేసి ఉన్నారు. అలాంటి భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవల్సి ఉంది. కానీ ఆచరణలో ఆ దిశగా చర్యలు లేవు.

అసైన్డ్ భూములను తిరిగిఇవ్వాలి..

సిహెచ్ గంగయ్య, సిపియం బాపట్ల జిల్లా కార్యదర్శి

దశాబ్దాల క్రితం పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను పలు గ్రామాల్లో ఉన్న పెద్దలు ఆక్రమించుకోవడం, కొద్దిపాటి సొమ్ములు ఇచ్చి చేజిక్కించుకోవడం జరిగింది. పేదలకు అసైన్డ్ భూములపై పూర్తి హక్కులు కల్పిస్తామని చెబుతూ ఆ భూములను అనర్హులైన వారిచేతుల్లో పెట్టే ప్రభుత్వ యత్నాలు సరికాదు. అసైన్డ్ భూములకు సంబంధించి రికార్డుల్లో ఉన్నవారు లేనట్లయితే వారి వారసులకు ఈ భూములు ఇవ్వాలి.

కరువుపై పాలకపక్షం మౌనం

(మొదటిపేజీ తరువాయి)

కనిపించడం లేదు. ఎన్నికల కోసం సభలు తప్ప ఏమీలేదు. మంత్రుల ప్రసంగాలు, నేతల జనం తరలింపులు వంటివే కనిపిస్తున్నాయి. మళ్లీ ఎన్నికలకు సమాయత్తమే కనిపిస్తోంది. రైతులు, కూలీలు, పేదలకు ఉపాధి వంటివి కనిపించడం లేదు. గ్రామాల్లో వ్యవసాయ పనుల్లేక మళ్లీ వలసబాట పడుతున్నారు. ఉపాధి హామీ పనులు కల్పించాలనే ఆలోచన కూడా చేయడం లేదు. మరోవైపు తాగునీరు లేక అవస్థలు పడుతున్నారు. చెరువులు కొన్ని నింపారు. చివరి ప్రాంతాల్లో ఉన్న చెరువులకు నీరు అందలేదు. గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్ల మరమ్మతులు కొలిక్కిరాలేదు. ఇలాంటి కరువు సమయాల్లో ఈ ప్రాజెక్టు అక్కరకు వచ్చేది. దీని కింద రబీలో 80 వేల ఎకరాల్లో సాగుకు నీరందుతుంది. పొగాకు గుండ్లకమ్మ నీరు కీలకంగా ఉపయోగపడేది. ఇప్పుడా పరిస్థితి లేదు. దీనిపైనా పాలకపక్షనేతలు చేతులెత్తేశారు. కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదు. ఇక అన్నిటికీ మించి పశ్చిమాన ఏడు మండలాల్లో ఇటీవల శాస్త్రవేత్తలు సర్వే చేశారు. అన్ని కోణాల్లో అధ్యయనం చేశారు. నివేదికలను జిల్లా అధికారులకు పంపారు. మంత్రి ఆదిమూలం సురేష్‌కు చెందిన నియోజకవర్గంలోని మండలాలన్నీ తీవ్ర ఆందోళనకరంగా మారాయి. భూగర్భజలాలు, వ్యవసాయం, వర్షపాతం, తాగునీరు, సాగునీరు. బోర్లు, చెరువులు, కుంటలు, నీటి వనరులపై సమగ్రసర్వే చేశారు. అన్ని అంశాల్లోనూ అక్కడ పరిస్థితులు ఆందోళనగా ఉన్నాయని గుర్తించారు. కనీసం ఈ నివేదికలను పరిగణలోకి తీసుకున్నా కనీసం ఆ ప్రాంతం కరువు కింద ప్రకటించాలి. అది కూడా చేయలేదు. ఈ విషయంలో పాలకపక్ష నేతలు పూర్తిగా విఫలమయ్యారనే చెప్పాలి. ఇప్పటికైనా ఇలాంటి నివేదికలపై స్పందించి తగు చర్యలు తీసుకోకుంటే భవిష్యత్‌లో మరింత ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కోవాల్సి ఉంటుంది. వీటిని హెచ్చరికలుగా తీసుకోవాలి. నీటి వనరులు పెంపునకు తగుచర్యలు తీసుకోవాలి.

జూపూడిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-మార్కాపురం

కావలిలో జరిగిన సామాజిక సాధికార సదస్సులో మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్‌రావు బ్రాహ్మణ కులాన్ని కించపరుస్తూ చేసిన వ్యాఖ్యల్ని మార్కాపురం బ్రాహ్మణ సంఘం నాయకులు తీవ్రంగా ఖండించారు. సామాజిక సాధికారత అంటే సామాజికంగా ఎదుగుదలను కోరుకోవాలే కానీ మరో కులాన్ని కించపరచడం కాదని స్పష్టం చేశారు. తక్షణమే జూపూడి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని బ్రాహ్మణ సామాజిక వర్గానికి క్షమాపణ చెప్పాలని, ప్రభుత్వం ఆయనపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు నాగరాజు, గోపాలుని శేషగిరిరావు, రమేష్, యం. మల్లికార్జున శర్మ, చక్కిలం నారాయణ రావు, సాయి సుబ్బారావు, మధు, మణి, నరసింహారావు పాల్గొన్నారు.

విద్యుత్ వెలుగులతో జరుగుతున్న గంధోత్సవం

వైభవంగా మహబూబ్ సుభాని గంధోత్సవం

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తిలో మహబూబ్‌సుభాని గంధోత్సవం వైభవంగా జరిగింది. స్థానిక బిలాల్‌నగర్, ఇస్లాంపేట, నవాబుపేటలలోని మహబూబ్‌సుభాని దర్గాల వద్ద భారీ సంఖ్యలో ప్రజలు కుల మతాలకతీతంగా పాల్గొని పూజలు చేశారు. మొక్కులు తీర్చుకున్నారు. ముస్లీం యూత్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశారు. స్థానిక ఇస్లాంపేట సెంటర్ దర్గా నుంచి గంధాన్ని భక్తిశ్రద్ధలతో ప్రత్యేకంగా అలంకరించిన గుర్రంపై ఊరేగించారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించి, గంధాన్ని పంపిణీ చేశారు. స్వాగత తోరణాలను యువ పారిశ్రామికవేత్తలు శిద్దా సుధీర్‌కుమార్, శిద్దా వెంకటేశ్వరరావు, శిద్దా హనుమంతరావు, శిద్దా సూర్యప్రకాశరావులు ఏర్పాటు చేశారు. కంభం నవరంగ్ వాయిద్యాలు, కోలాటాలు ఆకట్టుకున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఇస్లాంపేట సెంటర్‌లో సినీపాట కచ్చేరి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సమీర్ గ్రానైట్స్ అధినేత ఎస్.కె యస్ దాని, ఆశిక్ గ్రానైట్ అధినేత ఎస్.కె అబ్ సాలేహ, సన గ్రానైట్ అధినేతలు ఎస్.కె షరీఫ్, ఎస్.కె ఆరిఫ్‌ముస్లీంయూత్ నాయకులు ఎస్‌కె రఫీ, ఎస్‌కె మోమిన్, ఖాజా, అల్లాభక్షి, మహబూబ్ బాషా, సయ్యద్ రఫి, కోఆప్షన్ సభ్యులు ఎస్‌కె యస్‌దానీ, మాజీ సభ్యులు ఎస్‌కె అహమ్మద్‌బాషా, కౌన్సిలర్ ఎస్‌కె ఖాజా పాల్గొన్నారు.

'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి'

ప్రజాశక్తి-పుల్లలచెరువు

పుల్లలచెరువు గ్రామపంచాయతీలో సచివాలయం 2 పరిధిలో గారపెంట గ్రామంలో ఉదయం 6:30 గంటలకే గారపెంట గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమంలో లబ్ధిదారులకు జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న పథకాలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించారు. ప్రజలకు బుక్‌లెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ బోగోలు వెంకటసుబ్బారెడ్డి, సీనియర్ నాయకులు జానకి రఘు, సచివాలయ కన్వీనర్ దోమకాయల వెంకటేశ్వర్లు, వైసీపీ నాయకులు ఆ గ్రామంలో వాలంటీర్లు ప్రజలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండల పరిధిలో ఉన్న పెట్లూరు సబ్ స్టేషన్ పరిధిలోని పెట్లూరు, దాదానాయుడుపాలెం, చవటపాలెం, కోయవారిపాలెం, తాటాకులపాలెం, చినకండ్లగుంట, పోలిరెడ్డిపాలెం, గుర్రపడియ, మూగచింతల గ్రామాలలో నేడు విద్యుత్ అంతరాయం ఉంటుందని కరెంటు ఏఈ కుంచాల కోటయ్య తెలిపారు. నేడు ఉదయం 8 గంటల నుంచి మద్యాహ్నం 1గంట వరకు 33 కెవి మెయిన్ లైన్‌లో చెట్లను తొలగించడానికి, మరమ్మత్తులు చేయడానికి, విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు.

CHANGE OF NAME

I, **PARAMKUSHAM PADMAVATHI** (Old Name) W/o.Venkataseshacharyulu Resident of D.No.5-64,Main Road, Pernamitta Rural, Santhanuthalapadu Mandal, Prakasam District, Andhra Pradesh, India, have changed my name to **PARAMKUSHAM SUVARNA PADMAJA** (New Name) Hence forth I will be known as **PARAMKUSHAM SUVARNA** Will be applicable for all purposes.

పాస్‌పోర్టు పోయినది

ప్రకాశం జిల్లా కనిగిరి మండలం నందన మారెళ్ళకు చెందిన అర్చన నాగరాజ్ శంకేకు **30/C RLY QRTRS,** డైవర్షిల్, వాస్కోడ గామా, గోవా **403802** అనే చిరునామా మీద **X0968893** నంబర్ గల ఎమర్జన్సీ పాస్‌పోర్టు కనిగిరి మండలం చల్లగిరగల నుండి కనిగిరికి ఆటోలో ప్రయాణిస్తుండగా పోయినది దొరికినవారు క్రింది చిరునామాకు తెలియపరచగలరు.

ఇట్లు
అర్చన నాగరాజ్‌శంకే
H No-1, నదనమారెళ్ళ, చల్లగిరగల,
కనిగిరి మండలం, ప్రకాశం జిల్లా,
ఆంధ్రప్రదేశ్ 523245
మొబైల్ నెంబర్ : 7387222186

ప్రకటన

మా క్లయింట్,20 వార్డు కాళిదాసు, వీధి కందుకూరు నివాసి అయిన బోర్ల పెద కోటయ్య గారి కుమారుడు రమణయ్య ఇచ్చిన సంజాయిషీ మేరకు

మా క్లయింట్ తేది 20-02-1987 సం.సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట గ్రామ నివాసి అయిన దగ్గుబాటి రంగమ్మ, దగ్గుబాటి పోతురాజుల జ.ప. అ.ఏజెంట్ అయిన నాదెండ్ల కుటుంబరావు వద్ద నుండి, పేర్నమిట్ట గ్రామ సర్వేనెంబర్109/2 లొ కొంత ఆస్తిని కొనుగోలు చేసి వైడ్ డాక్యుమెంట్ నెంబర్ 87/1987 గా సంతనూతలపాడు సబ్ రిజిస్టర్ ఆఫీస్ లో రిజిస్టర్ చేయించుకుని స్వాధీనఅనుభవములో ఉన్నారు. కాగా సదరు ఆస్తిని మా క్లయింట్ అమ్మ చూడగా ఒకరు కొనుటకు ఏమనగా వారికి ఒరిజినల్ డాక్యుమెంటు చూపుటకు మా క్లయింట్ ఒంగోలు బైపాస్ సెంటర్లో డాక్యుమెంట్లు కవర్ తో సహా షేర్ ఆటో ఎక్కినాడు ఇతనితోపాటు కొందరు వ్యక్తులు పేర్నమిట్ట పోవుటకు సదరు ఆటో ఎక్కినారు వీరు అందరూ పర్నమిట్ట రాగానే మా క్లయింట్ తో సహా హడావుడిగా తోసుకుంటూ ఆటో దిగినారు అంతకు కొంతసేపటికి తర్వాత చూసుకునగా డాక్యుమెంట్లు ఉన్న కవరు తోపులటలో పోయినది కావున ఎవరికైనా పై ఒరిజినల్ డాక్యుమెంట్లు దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ తెలుపగలరు

ఇట్లు
బి.వెంకటరెడ్డి
అడ్వకేట్, గోల్డెన్ టవర్స్
రూమ్ నెంబర్ - 7, ఒంగోలు.
సెల్ నెం. 9703021077
బోర్ల రమణయ్య
తండ్రి పెద్దకోటయ్య కాళిదాసు విధి
కందుకూరు.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No: 395/2021

భూమా చిన్నలక్ష్మయ్య ..వాది
యెదరి
సలిజాముల శ్రీనివాసులు ..ప్రతివాది

To,
ప్రతివాది చిరునామా
సలిజాముల శ్రీనివాసులు తండ్రి వెంకటయ్య,
అక్కపల్లి గ్రామం, కొమరోలు మండలం,
ప్రకాశం జిల్లా.

పై నెంబర్ దావాలో మీపై దావా పరిహారం కొరకు దావా దాఖలు చేసి యున్నందున, మీకు సమను నిమిత్తము 14-11-2023 తేదికి వాయిదా వేసియున్నారు. కనుక తేదీ 14-11-2023 ఉదయం 10:30 గంటలకు మీరు స్వయముగా కానీ, మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టులో సంజాయిషీ చెప్పుకోవలసియున్నది. లేని యెడల మీ పరోక్షమందు దావాను విమర్శించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా తేదీ : 14-11-2023 ఇట్లు
కాకునూరి హిమశేఖరరెడ్డి,
వాది పరం న్యాయవాది,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No : 302/2023

గంగిశెట్టి వెంకటసుబ్బారావు ..వాది
వర్సస్
బోయల్ల బాలస్వామి ..ప్రతివాది

To
ప్రతివాది చిరునామా
బోయల్ల బాలస్వామి తండ్రి చిన్న లింగయ్య,
వయస్సు 53 సంవత్సరాలు, హిందూ, ఉద్యోగి,
ఓబులాపురం గ్రామం, కొమరోలు మండలం,
ప్రకాశం జిల్లా.

పై నెంబర్ దావాలోని వాది నీ నుండి దావా ప్రాంసరీ నోటు బాకీ మొత్తము వగైరాలు రాగోరి దావాను దాఖలు చేసియున్నారు. సదరు దావాలో నీకేమైనా ఆక్షేపణలు వున్న యెడల నీవు మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో తేదీ 15-11-2023న ఉదయం గం. 10:30 నిమిషాలకు స్వయంగా గాని, లేదా నీ వకీలు గారి ద్వారా గాని హాజరై, నీ ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేనిచో నీ పరోక్షమందు దావాను విమర్శించి తీర్మానించబడునని తెలియ జేయడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వు మేరకు //

గిద్దలూరు
తేదీ: 11-11-2023 ఇట్లు
శ్రీ షేక్ ఉస్మాన్‌షరీఫ్,
B.A.,L.L.B.
వాది పరం అడ్వకేట్,
గిద్దలూరు.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

EP 51/2022
IN
O.S.424/2016

జాదం లక్ష్మిదేవి ....DHR
వర్సెస్
దద్దనాల చిన్న తిరుమలయ్య & ఒకరు ...JDR's

JDR చిరునామా :
2వ JDR) జాదం శ్రీధర్ తండ్రి లేట్ జాదం వెంకోబ రావ్, వయసు సుమారు 42 సంవత్సరాలు, హిందూ, వ్యవసాయం, రాజుపాలెం గ్రామం పోస్ట్, కొమరోలు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు పిటిషన్ లో వాది పిటిషన్ పరిహారం రాగోరి మీ పై గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో పిటిషన్ దాఖలు చేసినందున, సదరు పిటిషన్ లో మీరు పై కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుటకు వాయిదా 15వ తేదీ నవంబర్ నెల 2023 సంవత్సరంలో ఉన్నది. మీరు ఈ వాయిదా రోజు ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గాని లేదా మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్ట్‌కు హాజరై మీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది, లేనిచో మీ పరోక్షమునందు పిటిషను విమర్శించి తీర్మానించబడును.

// కోర్ట్ వారి ఉత్తర్వు మేరకు //

గిద్దలూరు
తేది : 11-11-2023 ఇట్లు
శ్రీ షేక్ యాసిన్ బాషా
DHR తరపు అడ్వకేట్
గిద్దలూరు, ప్రకాశం జిల్లా
సెల్ : 9346513649

మహారాజశ్రీ పొదిలి జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

ఐ.ఏ.నెం:1559/2022
ఇన్
ఓ.ఎస్.నెం: 317/2022
అండ్
ఓ.ఎస్.నెం: 317/2022,

కనుబుద్ది రమణారెడ్డి ...పిటీషనర్/వాది
వర్సెస్
గొంట్ల ప్రవీణ్ ... రెస్పాండెంట్/ప్రతివాది

టు,
గొంట్ల ప్రవీణ్ తండ్రి వెంకటేశ్వరరావు వురఫ్ వెంకటేశ్వర్లు వయసు 40 సం.లు,హిందువు,
నివాసం పొదిలి గ్రామం, పొదిలి మండలం,
ప్రకాశం జిల్లా, ఆంధ్ర ప్రదేశ్.

పై దావాలో మీరు ప్రతివాది అయి ఉన్నారు. మీరు కావాలని నోటీసులు తీసుకోవడం లేదు. కనుక మీ వాయిదా తేది 11-12-2023న ఉదయం గం. 10-30 ని.లకు పై కోర్టులో మీరు గాని, మీ తరఫు లాయర్‌గారి ద్వారా వాయిదాకు హాజరై ఆన్సర్ దాఖలు చేయవలెను. లేనిచో మీ పరోక్షమున దావా నిర్మించబడునని తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ప్రదేశం : పొదిలి
తేది:11-11-2023 ఇట్లు
బోడి గారివెంకటేశ్వర్లు,
అడ్వకేట్ పొదిలి గ్రామం,మండలం,
ప్రకాశం జిల్లా,
సెల్:99854 36688.

పేరాలలో రెండు చోరీలు...

- సుమారు 460 గ్రాముల బంగారం, నగలు అపహరణ
- మరో ఇంట్లో రూ.7వేల నగదు, ఎటిఎం కార్డులు చోరీ
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ ప్రసాద్ రావు

స్థానికులతో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాదరావు,సిఐ శేషగిరిరావు

ప్రజాశక్తి - చీరాల

గత కొంత కాలంగా ప్రశాంతంగా ఉన్న చీరాల పట్టణంలో శనివారం పేరాలలో జరిగిన రెండు చోరీలు ఆ ప్రాంతవాసులను భయాందోళనకు గురిచేశాయి.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోనే పేరాల ఐదవ వార్డు వడ్డే నాగేశ్వరావు బజారులో చిచ్చుల సుబ్బారావు వాణిశ్రీ దంపతుల కుమారుడు శ్రీనివాస్ హైదరాబాదులో సాఫ్ట్ వేర్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే దీపావళి పండుగ రావడంతో పండుగను కొడుకు వద్ద జరుపుకునేందుకు సుబ్బారావు వాణిశ్రీ ఇద్దరు శుక్రవారం రాత్రి హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. అయితే ఆ ఇంటి రెండవ అంతస్తులు అద్దెకు ఉంటున్న వారు శనివారం ఉదయం మంచినీళ్ల కోసం క్రిందకి రావడంతో సుబ్బారావు ఇంటి తలుపులు తీసి ఉండటం గమనించి వారి బంధువులకు తెలియజేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న ఒకటవ పట్టణ సిఐ శేషగిరిరావు, డి.ఎస్.పి ప్రసాదరావులు చోరీ జరిగిన ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించారు. భార్యతో కలసి హైదరాబాదు వెళ్లిన సుబ్బారావును ఫోన్లో సంప్రదించి పలు వివరాలు సేకరించారు. సుబ్బారావు ఇంటికి ఉన్న ప్రధాన ద్వారం వెంట చిన్న తలుపులు పగులు గొట్టి దుండగలు చోరీకి పాల్పడినట్లు నిర్ధారించారు. ఇంటిలోని బీరువా పగలగొట్టి అందులో ఉన్న సుమారు 460 గ్రాముల బంగారం వస్తువులను అపహరించారని అదే బీరువాలో సుమారు 1కేజి వెండి ఉన్న వాటిని తాగకుండా కేవలం బంగారాన్ని మాత్రమే టార్గెట్గా చేసుకుని దుండగులు దొంగతనానికి పాల్పడినట్లు సుబ్బారావు బంధువులు పోలీసులకు తెలిపారు. జరిగిన ఘటనను ఛాలెంజ్ తీసుకున్న డిఎస్పి ప్రసాద్‌రావు వెంటనే క్లూస్ టీం డాగ్స్ స్క్వాడ్ రంగంలోకి దింపారు. అదేవిధంగా చుట్టుపక్క ప్రాంతాల వారిని విచారించి పలు వివరాలు సేకరించారు.

ఈ సందర్భంగా ఒకటవ పట్టణ సీఐ శేషగిరిరావు మీడియాతో మాట్లాడుతూ సప్లయర్ దుకాణ నిర్వాహకుడు సుబ్బారావు హైదరాబాద్ వెళ్లిన సమయంలో దుండగులు ఇంటిలో చొరబడి బంగారు నగలు చోరీకి పాల్పడినట్లు తమ విచారణలో తెలిసిందన్నారు. అయితే ప్రస్తుతం సుబ్బారావు హైదరాబాదులో ఉండడంతో అన్నారు. అధిక మొత్తంలోనే బంగారు నగలు అపహరణకు గురైనట్లు గుర్తించామన్నారు. ఆయన చీరాలకు రాగానే మరింత సమాచారం తెలుస్తోందని ఆ దిశగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు. ఇదిలా ఉండగా..ఇదే ప్రాంతంలో పక్క వీధిలో ఉన్న ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకుడు శ్రీనివాసరావు ఇంట్లో రూ.7వేల నగదుతో పాటు, ఏటీఎం కార్డులు, ఇతర కార్డులు అపహరించారని అయితే ఈ రెండు దొంగతనాలు శుక్రవారం రాత్రి జరగడంతో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఏది ఏమైనా బాధితులు వస్తేనే దొంగతనం పై పూర్తి స్పష్టత వస్తుందని పోలీసులు తెలిపారు. అయితే తమ ప్రాంతంలో ఒకేసారి రెండు వేరువేరు ఇళ్లల్లో చోరీలు జరగడంతో ఆ ప్రాంతవాసులు భయాందోళన చెందుతున్నారు.

నష్టపరిహారం చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-పెద్ద దోర్నాల

మండలంలోని కొర్రప్రోలు అటవీ శాఖ కార్యాలయంలో శనివారం అటవీ క్షేత్రాధికారి షేక్. అన్వర్ బాషా చేతుల మీదుగా పెద్దపులి దాడిలో చనిపోయిన పశువుల యజమాను దారులైన వై.చెర్లోపల్లి, నల్లగుంట్ల, పెద్దమంతనాల గూడెంలకు చెందిన 10 మందికి నష్టపరిహారం కింద రూ.2.18లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రసన్న జ్యోతితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం

నేడు చిన్నారులకు షటిల్ పోటీలు

ప్రజాశక్తి-మార్కాపురం

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 12వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు మార్కాపురం పట్టణంలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా వికాస్ కేంద్రం ఇండోర్ స్టేడియంలో షటిల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మార్కాపూర్ స్పోర్ట్స్ అండ్ యోగక్లబ్ అసోసియేషన్ అధ్యక్షులు భీమవరం వెంకటేశ్వరరెడ్డి వివరాలు వెల్లడించారు. ఈ పోటీలో 15 ఏళ్లలోపు బాల బాలికలు పాల్గొనవచ్చన్నారు. ఈ పోటీలను మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి ప్రారంభిస్తారన్నారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాస్‌లతో పాటు ప్రముఖులు హాజరవుతున్నట్లు చెప్పారు. విజేతలకు షీల్డ్స్, మెడల్స్‌తో పాటు సర్టిఫికెట్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన బాల బాలికల్లో క్రీడాకారులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

జమ్ము గ్రానైట్ క్వారీలో ప్రమాదం

- ఒకరు మృతి

ప్రజాశక్తి-బల్లికురవ

మృతుడు గుర్రప్ప

మండలంలోని గ్రానైట్ క్వారీలో జరిగిన ప్రమాదం కారణంగా మృతి చెందిన ఘటన శనివారం జరిగింది. వివరాల్లోకెళ్తే ఎస్ఐ యు వేమన తెలిపిన సమాచారం మేరకు ఈర్ల గంగమ్మ కొండలో ఉన్న జమ్ము క్వారీలో వైర్సా మిషన్ ఆపరేటర్‌గా పని చేస్తున్న తిమ్మన గుర్రప్ప (43) క్వారీ పనులు జరుగుతుండగా 15 అడుగుల ఎత్తు నుంచి పడటంతో మృతి చెందినట్లు ఎస్సై యు వేమన తెలిపారు. మృతుడు కడప జిల్లా కందిమల్లాయపాలెం గ్రామానికి చెందిన వారు. గత పది సంవత్సరాల నుంచి జమ్ములో పని చేస్తున్నట్లు సమాచారం. మృతునికి భార్య బాబు, పాప ఉన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే కంపెనీ యాజమాన్యం మృతుని బంధువులకు సమాచారం ఇవ్వకపోవడం వెనుక బలమైన కారణం ఉండి ఉండవచ్చని పలు అనుమానాలను కుటుంబ సభ్యులు వ్యక్తం చేస్తున్నారు. గుర్రప్ప సహచరుని సమాచారం మేరకే కుటుంబ సభ్యులకు తెలిసినట్లు వారు ప్రజాశక్తితో తెలిపారు. యాజమాన్యం మృతదేహాన్ని నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆధునిక విద్యకు ఆద్యుడు 'ఆజాద్'

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

దేశంలో ఆదునిక విద్యకు ఆద్యుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని ముస్లిం యూత్ సొసైటి అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్ అన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ 135వ జయంతి వేడుకలను యర్రగొండపాలెంలోని ముస్లిం యూత్ సొసైటి కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ ఇస్మాయిల్ మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత మొట్ట మొదటి విద్యాశాఖ మంత్రిగా దేశంలోని అట్టడుగు వర్గాల ప్రజలకు విద్యను అందించేందుకు ఎనలేని కృషి చేసిన మహనీయుడు అని కొనియాడారు. ముందుగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బహుజక ఐక్య వేదిక అధ్యక్షుడు కోటా డేవిడ్, యర్రగొండపాలెం నియోజకవర్గ జాతీయ బిజీ జేఏసీ అధ్యక్షులు పోసాని శ్రీరాములు, ముస్లిం యూత్ సొసైటి నాయకులు షేక్ షరీఫ్, చాంద్, బాషా, చోటు, సయ్యద్ ముక్తర్, సయ్యద్ అల్లామాలిక్, టివి బాషా తదితరులు పాల్గొన్నారు. **పెద్ద దోర్నాల**: స్వాతంత్ర్య సమర యోధుడు, భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖమంత్రి, మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి సందర్భంగా పెద్ద దోర్నాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల యందు శనివారం వారోత్సవాలు నిర్వహించారు. డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ కారుమూరి విజయబాలు మాట్లాడుతూ మనదేశానికి ఆజాద్ చేసిన సేవలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు అక్రమ్, శ్రీనివాసాచారి, జయసింహా, రమేష్‌తో పాటు అతిథి అధ్యాపకులు, భోధనేతర సిబ్బంది, పాల్గొన్నారు. **కొండపి :** కొండపి శాఖ గ్రంథాలయంలో గ్రంథపాలకుడు బి.కోటేశ్వరరావు ఆద్వర్యంలో భారత దేశ మొట్టమొదటి కేంద్ర విద్యాశాఖ మంత్రి మౌలానా అబ్బుల్ కలాం అజాద్ 155వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలానా అబ్బుల్ కలాం అజాద్ చిత్రపటానికి పూలమాలలు గ్రామ పెద్దలు, ఉపాద్యాయులు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు ఎస్‌కే బాబురావు, విశ్రాంత ప్రభుత్వ జూనియర్ కళాశాల అద్యాపకుడు బి.ఎల్. నరసింహం , ఉపాద్యాయులు, విఆర్‌వో అనీల్ , పాఠకులు తదితరులు పాల్గొన్నారు. **టంగుటూరు :** స్థానిక శాఖా గ్రంథాలయంలో భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న అవార్డు గ్రహీత మౌలానా అబుల్ కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం గ్రంధపాలకుడు గుమ్మడి వర్ధనరాజు ఆధ్వర్యంలో అబుల్ కలాం చిత్రపటం వద్ద గ్రామస్తులతో కలిసి ఆయన పూలమాలలతో నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అబుల్ కలాం దేశానికి చేసిన సేవలను వారు కొనియాడారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కె జాన్ బాబు, టి అనంతయ్య, ఎస్ కిరణ్, పి సుధాకర్, సంతోష్ కుమార్, ఎం అర్జున్ కె చిన్నా, ఎన్ ఉదయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైపాలెంలో ఆజాద్ జయంతి వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం

బావిలో పడి యువకుడు మృతి

ప్రజాశక్తి-కురిచేడు

ప్రమాదవశాత్తు బావిలోపడి యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే ఉరిచేడు గ్రామానికి చెందిన వెల్తుర్ల వెంకటేశ్వరరెడ్డి (సత్తిరెడ్డి) కురిచేడులోని నుసుం బజార్‌లోని ఒక బావిలో శవమై కనబడ్డాడు. గత మూడు రోజుల నుంచి అతని జాడలేక కుటుంబ సభ్యులు వెతుకుతున్న సందర్భంలో శనివారం నుసుం బజార్ వద్ద ఉన్న బావిలో ఒక యువకుడి శవం ఉందని స్థానికులు తెలపడంతో ఆ శవాన్ని గుర్తించి మృతుడు వెల్తుర్ల వెంకటేశ్వరరెడ్డిగా గుర్తించారు. మృతదేహాన్ని బావి నుంచి తీసి శవ పరీక్ష నిమిత్తం దర్శి ప్రభుత్వ ఆసుపత్రికి పోలీసులు తరలించారు. జరిగిన సంఘటనను పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కురిచేడు ఎస్ఐ ఎం.దేవకుమార్ తెలిపారు.

బోల్తా పడిన ఇసుక లారీ

ఇసుక లారీ బోల్తా... తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-కొండపి

ఇసుక లారీ బోల్తా పడిన ఘటన కొండపి మండలంలోని అనకర్లపూడి వద్ద ముసివాగు దగ్గర చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జరుగుమల్లి మండలం నుంచి ఇసుక లోడుతో వస్తున్న లారి కొండపి మండలంలోని అనకర్లపూడి వద్ద ఉన్న ముసి వాగు దగ్గరకు వచ్చినది. ముసివాగు పైన ఉన్న మలుపు వద్ద రోడ్డు మార్జిన్ దిగడంతో క్రుంగి లారి అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటన డ్రైవర్‌కు ఎటువంటి ప్రమాదం జరగలేదు. బోల్తా పడిని లారిని జెసిపి సహాయంతో పైకి లేపి కొండపి పోలీసు స్టేషన్ వద్దకు తీసుకొని రావడం జరిగింది.

ఆర్మీ ఉద్యోగిపై దాడి చేస్తున్న బార్ షాప్ సిబ్బంది

ఆర్మీ ఉద్యోగిపై బార్ షాప్ సిబ్బంది దాడి

ప్రజాశక్తి-చీరాల

పట్టణంలోని రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న స్థానిక లహరి బార్ అండ్ రెస్టారెంట్‌లో శనివారం రెస్టారెంట్ సిబ్బందికి ఆర్మీ ఉద్యోగి మధ్య వాగ్వాదం జరిగింది. అయితే రెస్టారెంట్లో ఏం జరిగిందో తెలియదు. కానీ రోడ్డుపై అందరూ చూస్తుండగా షాపు సిబ్బంది ఆర్మీ ఉద్యోగితో ఘర్షణ పడుతూ అతని ఐడి కార్డులను బలవంతంగా తీసుకున్నారు. దీంతో వారిద్దరి మధ్య జరిగిన గొడవ కొద్దిసేపు ఘర్షణ వాతావరణం తలపించింది. బార్ షాపుకు వచ్చిన కస్టమర్లపై సిబ్బంది తరచు వాగ్వాదానికి దిగుతూ దురుసుగా ప్రవర్తిస్తుంటారాని పలువురు అంటున్నారు. గతంలో కూడా ఇలాంటి ఘటనలు ఆ రెస్టారెంట్‌లో అనేకం జరిగాయని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆర్మీ ఉద్యోగితో పాటు అక్కడకి వచ్చే వారు కోరుతున్నారు.

ఎస్ఐగా సుదర్శన్

ప్రజాశక్తి- త్రిపురాంతకం

ఎస్ఐ సుదర్శన్

నూతన సబ్ ఇన్స్పెక్టర్‌గా బి. సుదర్శన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న సుమన్ ఉన్నతాధికారులు విఆర్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో జిల్లాలోని విఆర్‌లో ఉన్న సుదర్శన్‌ను బదిలీ చేశారు. స్టేషన్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు.

15న విజయవాడలో బహిరంగ సభ

సిపిఎం కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిహెచ్ మణిలాల్

ప్రజాశక్తి - రేపల్లె

సీపీఎం ప్రజారక్షణభేరిలో భాగంగా నవంబర్15న విజయవాడలో జరిగే బహిరంగ సభకు ప్రజలు తరలిరావాలని సిపిఎం కార్యదర్శి సిహెచ్ మణిలాల్ కోరారు. పట్టణంలో విస్తృతంగా సిపిఎం ప్రచారం నిర్వహించారు. ప్రజా సమస్యలు పరిష్కారం లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా సిపిఎం మూడు బస్సు యాత్ర బృందాలు పర్యటించాయని తెలిపారు. నవంబర్ 15న విజయవాడలో జరిగే బహిరంగసభకు సిపిఎం అఖిలభారత ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి, సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, ఇతర సిపిఎం అగ్రనేతలు పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలు ప్రజాసమస్యలు పక్కనపెట్టి అధికారమే లక్ష్యంగా కేంద్రంలోని బిజెపి కనుసన్నుల్లో పనిచేస్తున్నాయని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక హెూదా, అమరావతి ఏకైక రాజధాని, నిరుద్యోగ సమస్య, అధిక ధరలు, సామాజిక సమస్యలు, కార్మిక, విద్యార్థి, యువజన సమస్యలు పరిష్కరించాలని సిపిఎం నిర్వహిస్తున్న సభకు ప్రజలు తరలిరావాలని కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిపిఎం రేపల్లె నాయకులు కె రమేష్, ముఠా కార్మికులు బి శ్రీనివాస్, ఎన్ మధు, కె ఆంజనేయులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు : సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా రక్షణ బేరి బస్సు యాత్రల సందర్భంగా విజయవాడలో ఈనెల 15న నిర్వహిస్తున్న బహిరంగ సభ జయప్రదం చేయాలని కోరుతూ సిపిఎం నాయకులు శనివారం విస్తృత ప్రచారం చేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టి కృష్ణమోహన్ మాట్లాడుతూ అసమానతలు లేని సమాజం కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, పేద ప్రజల సమస్యల పరిష్కారానికి చేపట్టిన ప్రజారక్షణభేరి భారీ బహిరంగ సభకు ప్రజలు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి సుధాకర్, ఎం సత్యనారాయణ, బట్టు నాగమల్లేశ్వరరావు, పప్పుల అహరోను, శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు ఫి మనోజ్ పాల్గొన్నారు.

సిపిఎం కరపత్రాలు పంపిణీ చేస్తున్న టి కృష్ణమోహన్

ఏం అభివృద్ధి చేశారని.. ఏపీ నీడ్స్ జగన్

టిడిపి బాపట్ల పార్లమెంటు అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి ధ్వజం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

రాష్ట్రాన్ని ఏమి అభివృద్ధి చేశారని ఏపీ నీడ్స్ జగన్ పేరుతో ప్రజలను మోసం చేసేందుకు ప్రభుత్వ ఖర్చుతో అధికారుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించడం సిగ్గుచేటని టిడిపి బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రకటనలో ప్రశ్నించారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఏ ఒక్కరు అడగటం లేదన్నారు. ఊరూరా బెల్టుషాపులు పెట్టి నాసిరకం మద్యంతో అమాయకుల ప్రాణాలు పోగొట్టిన జగన్ మళ్ళి మాకు అవసరమా? అని ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులను సైతం నేటికీ ప్రారంభించుకోలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు. టిడిపి హయాంలో చేసిన అభివృద్ధి పనులకు వైసీపీ రంగులు వేసి ఎవరిని మోసం చేస్తారని ప్రశ్నించారు. రాష్ట్రంలో యువత భవిష్యత్తు నిర్వీర్యం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని అన్నారు. ఆఖరికి ప్రజలకు అవసరమైన ఇసుక, మట్టి, గాలి, నీరును సైతం వదిలిపెట్టకుండా దోచుకోవటంలో జగన్ ప్రభుత్వం చరిత్ర సృష్టించిందని అన్నారు. ప్రభుత్వ తప్పిదాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నేతలపై అక్రమకేసులు బనాయించి జైలుకి పంపించినందుకా ఏపీ నీడ్స్ జగన్ అంటూ ప్రజలు నిలదీసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించలేని అసమర్థ ప్రభుత్వం ఈ ఐదేళ్లలో ఏం అభివృద్ధి చేశారో వాస్తవ లెక్కలు ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు

ప్రజాప్రణాళికతో అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి - దర్శి

రాష్ట్రంలో ఉన్న వనరులను ఉపయోగించి ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేయాలని సీపీఎం జిల్లా నాయకులు కంకణాల ఆంజనేయులు కోరారు. దర్శి, దొనకొండ మండలాల్లో ప్రజా రక్షణ భేరి ప్రచార యాత్ర రెండోరోజు నిర్వహించారు. స్థానిక ఆంజనేయస్వామి గుడి వద్ద, కొత్తరెడ్డిపాలెం, రాజంపల్లి బస్టాండ్ సెంటర్లో, దొనకొండ మండలంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని గుండ్లకమ్మ, మూసి, మన్నేరు, సగిలేరు, పాలేరు తదితర నదులు, వాగులు ద్వారా ప్రతి సంవత్సరం 1200టీఎంసీల నీరు సముద్రంలో కలిసిపోతుందని అన్నారు. ఆ నీటితో లక్షలాది ఎకరాలు పండిచ్చవచ్చని తెలిపారు. ఇక్కడ ఉన్న మంత్రులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. దర్శి నియోజకవర్గంలో దొనకొండ పారిశ్రామిక కేంద్రం, కనిగిరి నిమ్జ్ ప్రాంతంగా అభివృద్ధి చేయాలన్నారు. జాతీయ డ్రైవింగ్ స్కూల్‌కు నిధులు కేటాయించాలని అన్నారు. నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే లైనుకు నిధులు కేటాయించాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం దర్శి డివిజన్ కార్యదర్శి తాండవ రంగారావు, వెంకటేశ్వరరావు, రంగనాయకులు, ఉప్పు నారాయణ, కెవి పిచ్చయ్య, సుబ్బారావు, వెంకయ్య, నాగరాజు పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా నాయకులు కంకణాల ఆంజనేయులు

పంచాయితీ కార్యదర్శికి వినతి పత్రం ఇస్తున్న నేతలు

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

స్థానిక అద్దేపల్లి దళితవాడలో సమస్యలు పరిష్కరించడంలో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి మనోజ్ పేర్కొన్నారు. సమస్యలు పరిశీలించి పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శి కోటా శ్రీనివాసరావుకు వినతిపత్రం శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ భట్టిప్రోలు పంచాయతీలో సగ భాగంగా ఉన్న అద్దేపల్లిని నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. అంబేద్కర్ విగ్రహం వద్ద నెలకొన్న ప్రధాన రహదారి సమస్య నేటికీ పరిష్కారం కాలేదని అన్నారు. మురుగునీటి సమస్య తాండవిస్తుందని తెలిపారు. ఎక్కడ మురుగు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతుందని అన్నారు. పంచాయితీలోని అన్ని ప్రాంతాల్లో కల్వర్టులు నిర్మిస్తున్న అధికారులు ఎస్‌సిల నివాస ప్రాంతాల్లో పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. అద్దేపల్లి ఎస్సీ కాలనీ నుండి గిరిజన కాలనీకి వెళ్లే రహదారిలో తూములు లేక మురుగు రహదారిపై చేరుతుందని అన్నారు. ఈ ప్రాంతాన్ని పరిశీలించి తక్షణమే కల్వర్టు నిర్మాణం చేయాలని కోరారు. అద్దేపల్లి స్మశాన వాటికలో ఖననం చేయటానికి రూ.10వేలకుపైగా ఖర్చు అవుతుందని తెలిపారు. నిరుపేదలైన దళితులు ఈ ఖర్చును భరించే పరిస్థితి ఉందని తెలిపారు. పంచాయతీ అధికారులు దళితవాడ స్మశాన వాటికలో కాటికాపరుని ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు. స్పందించిన కార్యదర్శి కోట శ్రీనివాసరావు మాట్లాడుతూ వినతి పత్రంలో ఉన్న సమస్యలను పంచాయితీ పాలకవర్గం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని అన్నారు. కార్యక్రమంలో వినోద్, ప్రకాష్, సుజయ్ ఉన్నారు.

27, 28 తేదీల్లో మహా ధర్నా

ప్రజాశక్తి -కనిగిరి

ఈనెల 27, 28న మహాధర్నా జరుగుతుందని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం రమేష్ తెలిపారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో కనిగిరి, వెలిగండ్ల అంగనవాడి ప్రాజెక్టు వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ విస్తృతస్థాయి సమావేశం సత్యవతి, ముక్కు మహాలక్ష్మమ్మ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఎం రమేష్ మాట్లాడుతూ సమాజంలో మాత మరణాలు, శిశు మరణాలు తగ్గించడానికి ఐసిడిఎస్ పథకాన్ని బలోపేతం చేయాలని, అంగన్వాడి హక్కుల సాధన కోసం పోరాటాలు చేయాలని అన్నారు. అంగన్వాడీలను, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. పెండింగ్ బిల్లులు ఇవ్వాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంట్రర్‌లుగా మార్చాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఉన్న వేతనాల కంటే అదనంగా ఇస్తామన్న ముఖ్యమంత్రి జగన్ మాట నిలబెట్టుకోవాలని కోరారు. ఎఫ్ఆర్‌సి యాపు జట్టిలంగా ఉందని, అన్ని యాప్‌లను కలిపి ఒకే యాప్‌లోకి మార్చాలని కోరారు. డిసెంబర్ 8నుంచి అంగన్వాడి సమస్యల మీద నిరవధిక సమ్మెలోకి వెళ్లాలని పిలుపునిచ్చారు. అనంతరం సీఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పిసికేశవరావు మాట్లాడుతూ బిజెపి పాలలో మైనార్టీలకు భద్రత లేకుండా పోయిందని అన్నారు. కోట్లాదిమంది కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను తెచ్చిందని అన్నారు. వైసిపి ప్రభుత్వ విధానం వలన పాఠశాలలు మూతపడుతున్నాయని అన్నారు. అంగనవాడి, ఆశాలకు, కాంట్రాక్టు అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు చేసిన వాగ్దానం గాలికి వదిలేసారని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు రాయల మాలకొండయ్య, డివైఎఫ్ఐ నరేంద్ర, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఎక్కంటి రాధమ్మ, వెంకట శ్రీలక్ష్మి, పద్మావతి, శైలజ, స్వప్న, హైమావతి, ప్రమీల, కుమారి, సరస్వతి, రజనిపాల్గొన్నారు.

సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం రమేష్

అసంపూర్తిగా ఉన్న షాదిఖాన వద్ద టిడిపి నేతల ఆందోళన

షాదీఖానా నిర్మాణం పూర్తి చేయాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండల కేంద్రమైన భట్టిప్రోలు పంచాయితీ అద్దేపల్లి గ్రామంలోని ముస్లిం షాదీఖానను టిడిపి నాయకులు శనివారం పరిశీలించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా ఆధ్వర్యంలో పోరుబాట నిర్వహించారు. అస్తవ్యస్తంగా ఉన్న షాది ఖానాను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. గత టిడిపి ప్రభుత్వ పాలనలో షాదీఖానా నిర్మాణానికి రూ.25లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఆ నిధులను సద్వినియోగపర్చి షాదిఖానా పనులు పూర్తి చేయాలని కోరారు. వైసీపీ ప్రభుత్వం దళిత, గిరిజనులు, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలను విస్మరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ కార్యదర్శి కుక్కల వెంకటేశ్వరరావు, మైనార్టీ నాయకులు సిరాజుద్దీన్, బీసీ సెల్ నాయకులు బట్టు మల్లికార్జునరావు, ఎస్సీ సెల్ నాయకులు కనపర్తి సుందర్రావు, ఎడ్ల జయశీలరావు, కంభం సుధీర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాగడాలతో నిరసన ప్రదర్శన చేస్తున్న పంచాయితీ కార్మికులు

వేతనాలు ఇవ్వాలని కార్మికుల నిరసన

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

పంచాయతీ కార్మికులు ఆరు రోజుల నుండి జీతాలు ఇవ్వాలని కోరుతూ రిలే దీక్షలు చేస్తున్నారు. పంచాయతీ అధికారులు, ప్రభుత్వ అధికారులు ఎవరు కార్మికులు మొర ఆలకించలేదు. గ్రామంలో ఆరు రోజుల నుండి చెత్తాచెదారం పేరుకుపోయింది. దోమలు, ఈగలతో దుర్వాసన వెదజల్లుతున్న ఎవరూ పట్టించుకోవడం లేదు. రహదారుల్లో ప్రయాణిస్తున్న ప్రజలు ముక్కులకు గుడ్డ అడ్డం పెట్టుకుని వెళుతున్నారు. పంచాయతీ కార్మికులు జీతాలు అడుగుతుంటే ప్రక్క మండలమైన కారంచేడు గ్రామం నుండి రోజువారి కూలీగా రు.600లు ఇస్తాము రండని పోటీ కూలీలను తీసుకువస్తున్నారు. వారిచేత పని చేయించే పనిలో పంచాయతీకి కొత్తగా వచ్చిన ఈఒ గోపి చేస్తున్న ప్రయత్నంకు సర్పంచ్ ప్రసన్న సైమన్ బాబు, ఇఒఆర్డి శ్రీనివాసరావు, ఎంపీడీఒ రాజ్యలక్ష్మి సహకారం అందిస్తున్నారు. పాత కార్మికులకు రోజువారి కూలీ రు.330 ఇస్తుంటే సమ్మె కాలంలో పనిచేయడానికి రు.600 కూలికి చేయించడం దేనికని, వాళ్ళకి ఇప్పుడు ఎలా సొమ్ము ఇస్తున్నారని గ్రామ ప్రజలు అంటున్నారు. కార్మికులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా గ్రామంలో ఒక పెద్దాయన మూడు రోజులపాటు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ప్రక్కగ్రామాల నుండి వస్తున్నటువంటి రైతన్నలు వారికి టీలు ఇప్పిస్తున్నారు. కానీ ఇంకోలు గ్రామ ప్రజలు కదలి రావాలని పంచాయతీ కార్మికులు కోరుతున్నారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పరిష్కారం కాలేదని తెలిపారు. ఆరు రోజులు కార్మికులు చేస్తున్న సమ్మెకు ఆరవ రోజు జనసేన నాయకత్వం కదలి వచ్చి కార్మికులతో మాట్లాడినారు. వాళ్ళు చేస్తున్న పోరాటానికి జనసేన పూర్తి మద్దతు ఉంటుందని నియోజకవర్గ కన్వీనర్ విజయ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి నాగండ్ల వెంకట్రావు, జిల్లా నాయకులు జి ప్రతాప్ కుమార్ కార్మికులకు అండదండలుగా నిలిచారు.

'మద్దిశెట్టి' శుభాకాంక్షలు

ప్రజాశక్తి - దర్శి

ప్రతి ఇంటా ఆనందాలు వెలగాలని ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ కోరారు. ప్రజలందరికి శాంతి సౌభాగ్యాలు, అష్టైశ్వర్యాలు అందాలని కోరారు. సుఖ సంతోషాలతో దీపావళి వేడుకలను జరుపు కోవాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

'ప్రజారక్షణ భేరి' సభను జయప్రదం చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-మార్కాపురం

లౌకిక వాదాన్ని కాపాడాలని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, అసమానతలు లేని అభివద్ధి కోసం ఈ నెల 15న విజయవాడలో జరిగే ప్రజారక్షణ భేరి సభను జయప్రదం చేయాలని సిపిఎం మార్కాపురం పట్టణ కార్యదర్శి డి సోమయ్య విజ్ఞప్తి చేశారు. ప్రజారక్షణ భేరి సభను జయప్రదం చేయాలని కోరుతూ మార్కాపురం పట్టణంలో శనివారం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం విభజన తరువాత ప్రత్యేక హోదాను మరిచిందని ధ్వజమెత్తారు. టిడిపి, జనసేన పార్టీలు ప్రత్యేక హోదాపై నోరు మెదపటం లేదని, మోడీకి సరెండర్ అయ్యారని అన్నారు. ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పేందుకు చేస్తున్న ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడడం కోసం సిపిఎం పోరాటాలు సాగుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం పథకాలు అంటూ ప్రజలపై భారాలు మోపుతూ ప్రజల నడ్డి విరుస్తున్నదని అన్నారు. జాతి సంపదలైన కేంద్ర ప్రభుత్వ సంస్థలన్నిటిని మోడీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతుంటే వైసిపి ప్రభుత్వం నోరు మెదపటం లేదని అన్నారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ప్రత్యామ్నాయ విధానాలతో కేరళలో సిపిఎం ప్రభుత్వం చేస్తున్న అభివద్ధి గురించి వివరించడం, అటువంటి ప్రభుత్వాలు ఏర్పడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రైతు ప్రభుత్వం అంటూ రైతులకు కనీసం మద్దతు ధర ప్రకటించడంలో, ఎండిన పంటలకు నష్టపరిహారం ఇవ్వడంలో, కరువు మండలాలు ప్రకటించడంలో ప్రభుత్వం రైతులకు మొండి చేయి చూపిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గుమ్మా బాలనాగయ్య, డీకేఎం రఫీ, పి రూబెన్, జవ్వాజి రాజు, కట్టా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

టంగుటూరు : ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, అసమానతలు లేని అభివద్ధి కోసం లౌకిక వాదాన్ని కాపాడాలని కోరుతూ ఈనెల 15వ తేదీన సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో విజయవాడలో చేపట్టనున్న ప్రజా రక్షణభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వి బాలకోటయ్య విజ్ఞప్తి చేశారు. శనివారం మండలంలోని కొణిజేడు గ్రామంలో ప్రజారక్షణ భేరిని జయప్రదం చేయాలని కోరుతూ సిపిఎం నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం బిజెపి రాష్ట్ర ప్రత్యేక హోదాను పూర్తిగా విస్మరించిందని, ఫలితంగా రాష్ట్రం అప్పుల ఊబి లోకి నెట్టబడిందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ రంగాలను ప్రైవేటుపరం చేసేందుకు కేంద్రంలోని నరేంద్ర మోడీ చేస్తున్న ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ప్రజలు ఉద్యమాల బాటను పట్టారని చెప్పారు. మతపరమైన అంశాలను ముందుకు తెస్తూ పోరాటాలను నిలువరించేందుకు బిజెపి చేస్తున్న ప్రయత్నాలను తిప్పి కొట్టాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం టంగుటూరు మండల కన్వీనర్ వేశపోగు మోజెస్, కొనిజేడు గ్రామ కార్యదర్శి షేక్ మీరాస్, ఎం కోటయ్య, జి దాసు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొణిజేడులో ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

నిరసన తెలిజేస్తున్న సిపిఎం నాయకులు

పాలస్తీనాపై దాడులు ఆపాలి : సిపిఎం

ప్రజాశక్తి-చీమకుర్తి

పాలస్తినాపై ఇస్రాయిల్ దాడులు ఆపాలనీ, సామ్రాజ్యవాదం నసించాలని ,ప్రపంచ శాంతి వర్ధిల్లాలని సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్లో నిరసన కార్యక్రమం చేపట్టారు. శనివారం సాయంత్రం స్థానిక బస్టాండ్ సెంటర్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడివెంకటరావు, సిపిఎం మండల కార్యదర్శి పూసపాటి వెంకటరావు మాట్లాడుతూ పాలస్తీనాలోని గాజాపై ఇస్రాయిల్ సాగిస్తున్న సైనిక దిగ్భంధాన్ని తక్షణమే విరమించాలని, యుఎన్ఐ తీర్మానం ప్రకారం పాలస్తీనా భూభాగం నుంచి ఇస్రాయిల్ సైన్యం వైదొగాలని ,పాలస్తీనాకు భారత్ ప్రభుత్వం సంఘీభానం ప్రకటించి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పల్లాపల్లి ఆంజనేయులు, కె చిన్నపురెడ్డి, బెజవాడ శ్రీను, పులి ఓబులరెడ్డి, కంకణాల వెంకటేశ్వర్లు, నల్లూరి కృష్ణయ్య, సిహెచ్ కొండయ్య, కె అక్కయ్య, మాదాల నారాయణ పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చర్ అంశాన్ని ఆలకిస్తున్న కళాశాల విద్యార్థులుల

పేస్ కళాశాలలో ముగిసిన గెస్ట్ లెక్చర్

ప్రజాశక్తి-టంగుటూరు

స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ (రీజనల్) ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు "లైఫ్ ఇన్ సాఫ్ట్ వేర్ సైకిల్" అనే అంశంపై నిర్వహించిన గెస్ట్ లెక్చర్ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా గెస్ట్ లెక్చర్ రిసోర్స్ పర్సన్ కటకం సురేష్ మాట్లాడుతూ సాఫ్ట్ వేర్ రంగంలో ఉండే వివిధ దశలు, వాటి ప్రాముఖ్యతలను వివరించారు. సాఫ్ట్ వేర్ రంగంలో ఉండే వివిధ అవకాశాలు, విధులు, బాధ్యతలపై విద్యార్థులు తగిన అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. అదేవిధంగా సాఫ్ట్ వేర్ రంగంలో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు విద్యార్థులు చేయవలసిన సాధనలను సురేష్ విద్యార్థులకు విపులీకరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కలస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే మూర్తి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి బి శ్రీహర్ష, కోఆర్డినేటర్ ఎస్ నవీన్, బి వంశీకష్ణ, కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

బాలల సైన్స్ కాంగ్రెస్‌కు ఎంపిక

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

ఒంగోలులోని డిఆర్ఆర్ఎం హై స్కూల్లో శనివారం జరిగిన బాలల సైన్స్ కాంగ్రెస్‌కు ఈదుమూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి తీసుకెళ్లిన "సొగసు చూడ తరమా " అనే పోజెక్ట్ 31 వ రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ప్రథమ స్థానంలో ఎంపికైనది. ఈసందర్భంగా ఆర్‌జెడి ఇన్‌చార్జి డిఇఓ వి ఎస్ సుబ్బారావు ఈ ప్రాజెక్ట్ తయారుచేసిన 10వ తరగతి బాలికలు పి నందినీ, అఖిలలను ట్రైనింగ్ టీచర్‌గా వ్యవహరించిన కాకి స్వర్ణలత, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయురాలును అభినందించారు. అనంతరం వారికీ ప్రశంసా పత్రం,బహుమతి మెమెంటో అందచేశారు. ఈ సందర్భంగా ఈదుమూడి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. శంకరరావు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు ప్రాజెక్ట్‌ను ప్రదర్శించిన బాలికలకు, ట్రైనింగ్ టీచర్‌కు అభినందనలు తెలిపారు.

జగన్ దళిత ద్రోహి

దళిత నేత నేలం నాగేంద్రరావు ధ్వజం.!

ప్రజాశక్తి-టంగుటూరు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దళిత ద్రోహి అని, ఆయన అవసరం దళితులకు ఏమాత్రం లేదని దళిత నేత నీలం నాగేంద్రరావు ధ్వజమెత్తారు. శనివారం స్థానిక అంబేద్కర్ బొమ్మ సెంటర్ లో ఆయన మాట్లాడుతూ వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని జగన్ జీతగాళ్లుగా ఉన్న వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, గహసారథులు మాత్రమే పోలీసు కాపలాల మధ్యనే బలవంతంగా నిర్వహిస్తున్నారని నీలం నాగేంద్ర ఆరోపించారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం పై ఎస్సీ, ఎస్టీ, బీసీలతో నియోజకవర్గాల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించాలని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ లు దీనిపై ముఖ్యమంత్రి జగన్ ను, వైసీపీ నాయకులను నిలదీయాలని సూచించారు. వైసీపీ ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక అన్యాయ యాత్రకు నిరసనగా ఈనెల 19న ఒంగోలు అంబేద్కర్ భవన్ లో మధ్యాహ్నం 2 గంటలకు రాష్ట్రస్థాయి దళిత సంఘాల సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశానికి ప్రతిపక్ష రాజకీయ నేతలతో పాటు వైసీపీ లోని ఎమ్మెల్యేలు, ఎస్సీ, ఎస్టీ నాయకులు కూడా హాజరుకావాలని నీలం నాగేందర్రావు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు పాలేటి కోటేశ్వరరావు, దారా అంజయ్య, వడ్డిముక్కల సురేష్, తానికొండ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-వెలిగండ్ల

ఈనెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు వెలిగండ్ల లో గ్రంథాలయ వారోత్సవాలు జరుగునని గ్రంథ పాలకుడు భాస్కర్ ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. ఈ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థిని విద్యార్థులకు క్విజ్ వ్యాసరచన మరియు ఆటల పోటీలు జరుగునని గెలుపొందిన విద్యార్థులకు ఈనెల 20వ తేదీ ముగింపు వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా బహుమతి ప్రధానం జరుగునని ఆయన తెలిపారు. కావున ఈ అవకాశాన్ని మండలంలోని విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

వినుకొండ నుంచి శ్రీశైలంకు బస్సు ఏర్పాటు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వినుకొండ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి నూతనంగా వినుకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేశారు. ఈ బస్సును శనివారం వినుకొండలో వైఎస్సార్ ఓసీ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు గోగిరెడ్డి గోవిందరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా గోగిరెడ్డి గోవిందరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, మాజీ టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఆర్టీసీ చైర్మన్ మల్లిఖార్జునరెడ్డిల సహకారంతో నూతనంగా ఈ బస్సు సర్వీసును ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం వినుకొండ నుంచి వెల్లటూరు మీదుగా పుల్లలచెరువు మండలంలోని పుల్లలచెరువు, ఆర్ ఉమ్మడివరం, వెంకటరెడ్డిపల్లి, రాచకొండ, మల్లాపాలెం, యర్రగొండపాలెం మీదుగా శ్రీశైలం వెళ్తుందన్నారు. ఉదయం ఆరు గంటలకు వినుకొండలో బయలుదేరి 12 గంటలకు శ్రీశైలం చేరుకుంటుందని తెలిపారు. తిరిగి ఒంటి గటంకు శ్రీశైలంలో బయలుదేరి రాత్రి 7:30 గంటలకు వినుకొండ చేరుకుంటుందని తెలిపారు. ఈ బస్సు ఏర్పాటు మూలంగా యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాలకు దూరభారం తగ్గుతుందన్నారు. ఈ బస్సు ఏర్పాటుకు సహకరించిన మార్కాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ కోటేశ్వరరావు నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బస్సు ఏర్పాటుకు కృషి చేసిన గోగిరెడ్డి గోవిందరెడ్డికి సుబ్బారావు, పులిపాటి రామారావురెడ్డి, నగేష్, చింత ఆదిరెడ్డి, గ్రంధిశిల హనుమంతరావులు ఘనంగా సన్మానించారు. అలాగే పుల్లలచెరువు మండల ప్రజలు కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బస్సును ప్రారంభిస్తున్న దృశ్యం

ఉన్నత విద్యా రంగంలో డిగ్రీ కళాశాలలే కీలకం

ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎం.అంజిరెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

మానవ వనరుల వృద్ధిలో... అందులోనూ ఉన్నత విద్యారంగంలో డిగ్రీ కలాశాలలు అత్యంత కీలకమని, ప్రామాణికతలో కూడిన గుణాత్మక విద్యను అందిస్తేనే యువత నైపుణ్యవంతులుగా స్వయం ఉపాధి సాధిస్తారని ఒంగోలులోని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎం.అంజిరెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల అకస్మిక సందర్శనలో భాగంగా వర్సిటీ ఉపకులపతి ఆచార్య అంజిరెడ్డి స్థానిక శ్రీసాధన డిగ్రీ కళాశాలను శనివారం సందర్శించారు. కళాశాల ప్రయోగశాలలు, గ్రంథాలయం, మౌళిక వనరులు, కార్యాలయ నిర్వహణ, పరీక్షల విభాగం పనితీరు, ప్రాంగణ నియామకాల విభాగం కృషి మొదలైన వాటిని నిశితంగా పరిశీలించారు. అధ్యాపకులతో నేరుగా మాట్లాడిన ఆయన కళాశాల ప్రగతిలో యాజమాన్య సభ్యుల చొరవను అధ్యాపకుల అంకిత భావాన్ని ప్రశంశించారు. ఉపకులపతితో పాటు విశ్వవిద్యాలయ ఓఎస్‌డి ఆచార్య కెవిఎన్ రాజు కూడా అకస్మిక సందర్శనలో పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్‌తో పాటు యాజమాన్య సభ్యులు సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డి.రాజగోపాల్‌రెడ్డి, డైరెక్టర్లు ఎంవి క్రిష్ణారెడ్డి, విఆర్‌కె ప్రసాద్, డాక్టర్ వెన్నా క్రిష్ణారెడ్డి, జిఎల్ రమేష్‌బాబు, వైస్ ప్రిన్సిపల్ పి.శ్రీధర్‌కుమార్, క్యాంపస్ అండ్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ విభాగం సమన్వయకర్త కె.పవన్‌కుమార్, పరిశోధన విభాగం సమన్వయకర్త డాక్టర్ ఎం.శేషుకుమార్, కళాశాల ఇన్‌చార్జి డాక్టర్ పి.ఆర్‌కె ప్రసాద్, అధ్యాపక బృందం తొలిసారిగా కళాశాలను సందర్శించిన ఉపకులపతి అంజిరెడ్డిని సత్కరించారు. **పెద్ద దోర్నాల** : పెద్ద దోర్నాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆంధ్రా కేసరి విశ్వవిద్యాలయం విసి మారెడ్డి అంజిరెడ్డి శనివారం సందర్శించారు. డిగ్రీ కళాశాల గురించి అడిగి తెలుసుకొని అధ్యాపకులతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థులు ఈ నూతన విద్యా విధానంను అందరూ వినియోగించుకోవాలని తెలిపారు. విద్యార్థులతో మాట్లాడిన అనంతరం హర్షం వ్యక్తంచేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కారుమూరి విజయబాబు అంజిరెడ్డిని శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నాగరాజు, అక్రమ్, బోధనేతర సిబ్బంది, విద్యార్థిలు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న విసి అంజిరెడ్డి

కనిగిరిని కరువు ప్రాంతంగా ప్రకటించాలి

ప్రజాశక్తి -కనిగిరి

నియోజకవర్గంలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని పిసిసి సభ్యులు పిల్లి వెంకటేశ్వరరెడ్డి కోరారు. నియోజక వర్గం సమన్వయ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. అక్టోబర్ 31న రాష్ట్ర ప్రభుత్వం ఏడు జిల్లాల నుండి 103 కరువు మండలాలుగా ప్రకటించిందని అన్నారు. కనిగిరి నియోజకవర్గంలో సాధారణ వర్షపాతం నమోదు కాలేదని తెలిపారు. అయినప్పటికీ కరువు మండలాల జాబితాలో లేకపోవడం వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్యమేనని అన్నారు. కరువు కాటేసిన రైతు బాధలు జిల్లా మంత్రికి గాని, కనిగిరి ఎమ్మెల్యేకు కానీ కనిపించకపోవడం విడ్డూరమన్నారు. కరువును పెరామీటర్లను పాటించకపోవడం వల్లే ఇటువంటి దుస్థితి ఏర్పడిందని అన్నారు. వెంటనే కరువు మండలాలను ప్రకటించి ప్రతి ఎకరాకు రూ.50వేల ఆర్థిక సాయం అందించాలని కోరారు. రైతు ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలేనని అన్నారు. ఆత్మహత్యకు పాల్పడిన రైతు

కనిగిరిలోమాట్లాడుతున్న పిసిసి సభ్యులు పిల్లి వెంకటేశ్వరరెడ్డి

కుటుంబాలకు రూ.25లక్షలు చెల్లించాలని, ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. కరువుకు ప్రభుత్వం స్పందించకపోతే రానున్న రోజుల్లో రైతుల భాగస్వామ్యంతో ఉద్యమా లను ఉధతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సమన్వయ కమిటీ సభ్యులు వేల్పుల రాజశేఖర్, షేక్ మొహమ్మద్ భాష, సంగటి మల్లికార్జునరెడ్డి, కనిగిరి సోషల్ మీడియా కోఆర్డినేటర్ షేక్ రియాజ్ పాల్గొన్నారు.

దర్శి : తాళ్లూరు మండలంలో వర్షాలు పడక ఎండిపోతున్న పంటల రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్లూరి కొండారెడ్డి కోరారు. పంటలను శనివారం పరిశీలించారు. తహశీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో కరువు లేదని సిఎం చెప్పడం సరికాదని అన్నారు. కష్టాల్లో ఉన్న వారిని, రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఎకరానికి రూ.50వేలు చొప్పున నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కర్నా పుల్లారెడ్డి, చెన్నకేశవులు, నరసింహారావు, చిన్నకోటయ్య, శంకర్, సాయికృష్ణ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ఇంటింటికీ సంక్షేమం

పాదిలిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నూర్జహాన్‌బేగం

ప్రజాశక్తి - పొదిలి

ముఖ్యమంత్రిగా జగన్ మోహన్ రెడ్డిని మరోసారి గెలిపించుకుందాం. సంక్షేమ పథకాల అమలును కొన సాగిద్దాం అంటూ స్థానిక నగర పంచాయతీ వైసిపి అధ్యక్షు రాలు ఎస్‌కె నూర్జహాన్ బేగం అన్నారు. ఆంధ్ర ప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే అనే కార్యమ్రంలో భాగంగా ఆమె పొదిలి పట్టణంలోని 4వ సచివాలయం పరిధిలోని ప్రకాష్‌నగర్, బిసి కాలనీలో శనివారం ఇంటింటికి తిరిగి జగనన్న పెట్టిన సంక్షేమ పథకాలు గురించి తెలిపారు. మార్కాపురం శాసనసభ్యులు కెపి నాగార్జునరెడ్డి ఆధ్వర్యం లో ప్రతి ఇంటికి తిరిగి జగనన్న ప్రభుత్వం నమ్ముదాం మళ్ళీ ముఖ్యమంత్రిగా చేద్దాం అనిప్రచారం చేశారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కావడంలేదన్నారు. కార్యక్రమంలో ఆమెతోపాటు మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు ఎస్‌కె మస్తాన్‌వలి, నాయకులు ఖాశిం పాల్గొన్నారు.

పొదిలి : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేద ప్రజల పట్ల ఏ విధంగా నడుచుకున్నారో, ఏ విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారో గమనించి మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కెవి రమణారెడ్డి కోరారు. ఆంధ్రప్రదేశ్ కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం వైసీపీ మండల కన్వీనర్ దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, నగర పంచాయతీ అధ్యక్షురాలు షేక్ నూర్జహాన్ బేగం ఆధ్వర్యంలో తలమళ్ల, పట్టణంలోని 4వ సచివాలయం పరిధిలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ శ్రీకృష్ణ, వైసీపీ నాయకులు కొండ్రగుంట సుబ్బారావు, ఎస్‌కె మస్తాన్‌వలి పాల్గొన్నారు.

భట్టిప్రోలు : సిఎం జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరుపై వైసిపి నాయకులు శనివారం ప్రచారం చేశారు. ఎంపీపీ డివి లలిత కుమారి, జెడ్పిటిసి ఉదయభాస్కర్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. పేదల పక్షపాతిగా జగన్మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ ఫలాలు అందించారని అన్నారు. పేదవానికి దనికునికి మధ్య జరిగే పోరాటంలో పేదల పక్షపాతిగా జగన్మోహన్‌రెడ్డికి మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వైసీపీ మాజీ మండల కన్వీనర్ పడమట శ్రీనివాసరావు, పాతర్లంక బుల్లి అబ్బాయి, నాగమల్లేశ్వరరావు, బాలాజీ, చిన్నారి నాగేశ్వరరావు ఉన్నారు.

భట్టిప్రోలు : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పరిశీలించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు పల్లెనిద్ర చేపట్టినట్లు వైసీపీ మండల కన్వీనర్ మురళి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం రాత్రి వైసీపీ నాయకుల గ్రామంలో పల్లెనిద్ర కొనసాగించారు. రాష్ట్రానికి జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఎందుకు కావాలనే నినాదంతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటివరకు అమలు చేసిన సంక్షేమ పథకాల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పేద ప్రజలకు అండగా ఉండే జగన్మోహన్ రెడ్డికి మరోసారి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు మల్లేశ్వరరావు, గోవర్ధనగిరి శేషాచల శ్రీనివాసరావు, వేల్పూరి నాగేశ్వరరావు, చిన్నారి, కుందేటి రమేష్ ఉన్నారు.

భట్టిప్రోలులో పథకాలపై ప్రచారం చేస్తున్న ఎంపిపి లలిత

వార్డు ప్రజలతో మాట్లాడుతున్న ఛైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య

3వ వార్డులో తాగునీరు అందిస్తాం

ప్రజాశక్తి - దర్శి

స్థానిక 3వ వార్డులో ప్రజల అవసరాల కోసం పైపు లైన్ వేసి తాగునీరు ఇస్తామని నగర పంచాయతీ ఛైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య అన్నారు. 1, 3వ వార్డుల్లో ఆయన శనివారం ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. డ్రైనేజీ సైడు కాలువలను పరిశీలించారు. సైడు కాలువలు నిర్మిస్తామని అన్నారు. సమస్యలు పరిష్కరించే దుకు తమ వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పట్టణ అధ్యక్షులు యాదగిరి వాసు, కౌన్సిలర్ దినకర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రెహమాన్, రాజ్‌కుమార్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

నాదెండ్లను కలిసిన వరికూటి నాగరాజు, ఆమంచి స్వాములు

నాదెండ్లను కలిసిన వరికూటి

ప్రజాశక్తి,దర్శి

జనసేన పార్టీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను దర్శి నియోజకవర్గ జనసేన నాయకులు, లీగల్ సెల్ జిల్లా కార్యదర్శి వరికూటి నాగరాజు మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. తెనాలి జనసేన పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి ఆమంచి స్వాములుతో కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

బిబిహెచ్ కాలేజీలో మాట్లాడుతున్న లేళ్ల కృష్ణమూర్తి

బాలల దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక బిబిహెచ్ జూనియర్ కాలేజీ ప్రాంగణంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ లేళ్ల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జాతీయ పతాకను శనివారం ఆవిష్కరించారు. అనంతరం లక్ష్మీ తులసమ్మ చారిటబుల్ ట్రస్ట్ వారిచే పి ఉమామహేశ్వరరావు విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. 15స్కూల్ నుండి 120మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలను కొసనం నాగమాంబ ప్రారంభించారు. గొరాబత్తుని రవిబాబు పోటీలు నిర్వహించారు. బాలల దినోత్సవం సందర్భంగా అల్లా శ్రీరామమూర్తి సూచనల మేరకు జరిగిన కార్యక్రమంలో సత్రం మల్లేశ్వరరావు, కోడూరు ఏకాంబేశ్వరబాబు, కార్యదర్శి ఆవుల పున్నయ్య, స్వర్ణ ప్రయోగరావు పాల్గొన్నారు.



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు

కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- కనిగిరి

జనని చారిటబుల్ ట్రస్ట్, శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త సహకారంతో కనిగిరి మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇన్చార్జ్ డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో కనిగిరి అమరావతి గ్రౌండ్లో శనివారం కంటి ఆపరేషన్ చేయించుకున్న వారికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. శంకర కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ బిపిన్ రాహుల్, డాక్టర్ దీక్ష కంటి వైద్య పరీక్షలు చేశారు. పారా మెడికల్ సిబ్బంది కంటి చూపు పరీక్షలు చేశారు. వారందరికీ భోజన వసతి కల్పించారు.

నిబంధనలు పాటించని వారిపై చర్యలు

ప్రజాశక్తి - రేపల్లె

దీపావళి క్రాకర్స్ విక్రయించే దుకాణా లకు తప్పనిసరిగా ప్రభుత్వ అనుమ తులు తీసుకోవాలని తహశీల్దార్ మల్లి ఖార్జునరావు తెలి పారు. నిబంధనలు పాటించని విక్రయ దారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలోని జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన టపాసుల విక్రయ షాపులను శనివారం ఆయన పరిశీలించారు. నాలుగు హోల్ సేల్ క్రాకర్స్ దుకాణాలు, 24రిటైల్ షాపులకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. మండలంలోని ఉప్పుడిలో ఒకషాపు, పేటేరు లంకమ్మ చెట్టు వద్ద 4 షాపులు, పట్టణంలోని జూనియర్ కళాశాల ఆవరణలో ప్రస్తుతానికి 19షాపులకు అనుమతులు ఇచ్చినట్లు చెప్పారు.

ఒత్తిడితో డ్రైవింగ్ చేయొద్దు

ప్రజాశక్తి - రేపల్లె

ఎస్ఐ నవీన్ కుమార్

క్షణాల్లో గమ్యాన్ని చేరాలనే ఒత్తిడితో మితిమీరిన వేగం ప్రాణాలమీదకు తెస్తున్నాయని పట్టణ ఎస్ఐ జి నవీన్ కుమార్ అన్నారు. తన కార్యాలయంలో విలేకరులతో శనివారం మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు పోలీసులు, ప్రభుత్వం ఎన్నో రకాల భద్రతా చర్యలను చేపడుతుందని అన్నారు. ప్రభుత్వం బాధితులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకున్నప్పటికీ మరణించిన వారి లోటు పూడ్చలేనిదని తెలిపారు. ప్రమాదాల్లో మరణిస్తున్న వారిలో ఎక్కువగా 18నుంచి 35ఏళ్ల వయసులోపువారే ఉంటున్నారని తెలిపారు. మానవత్వంతో రోడ్డు ప్రమాదాల్లో గాయపడినవారికి సాయం చేయడంలో ముందుండాలని కోరారు.

వ్యవసాయంలో హైడ్రో ఫోనిక్స్ కీలకం

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

ధృవీకరణ పత్రాలు అందిస్తున్న డీన్

డాక్టర్ ఎన్‌టిఆర్ కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ కళాశాలలో హైడ్రో ఫోనిక్స్ అనే నూతన వ్యవసాయ శిక్షణ ముగింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ పరిధిలోని డాక్టర్ ఎన్టీఆర్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ కళాశాలలో హైదరాబాదు లోని ఐజీహెచ్ ఫార్మ్స్ లిమిటెడ్, గ్రో వైజ్ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి వచ్చిన డాక్టర్ ఎం సత్యనారాయణరెడ్డి, ఎ లక్ష్మి ఈ నెల 8నుంచి 11వరకు హైడ్రో ఫోనిక్స్ అనే నూతన వ్యవసాయ విధానంపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ ముగింపు సమావేశానికి కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డీడీ స్మిత్ అధ్యక్షత వహించారు. శిక్షణలో పాల్గొన్న 86మంది విద్యార్థులను అభినందించారు. డీన్ డాక్టర్ సీహెచ్‌వివి సత్యనారాయణ మాట్లాడుతూ భవిష్యత్ తరాలలో వాతావరణంలోని మార్పులు, పర్యావరణ సమస్యలతో సంబంధం లేకుండా వ్యవసాయంలో హైడ్రో ఫోనిక్స్ ప్రాముఖ్యత వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ మిద్దె సాగు గురించి వివరించారు. డాక్టర్ బి జాన్ వెస్లీ హైడ్రో ఫోనిక్స్ ప్రత్యేకతను వివరించారు. డాక్టర్ కెఎన్ రాజ్ కుమార్ మాట్లాడుతూ హైడ్రో ఫోనిక్స్ ప్రాథమిక అంశాలు తెలిపారు. డాక్టర్ జి రవిబాబు శిక్షణ నివేదికను సమర్పించారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు అందచేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్ గణేష్‌బాబు, కె కృపావతి పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి - కనిగిరి

ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికులకు అందిస్తున్న సేవలపై ఆదివారం డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ బి శ్రీమన్నారాయణ శనివారం తెలిపారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 9959225701 నెంబర్‌కు ఫోన్ చేసి ప్రయాణికుల సమస్యలు తెలపాలని కోరారు.

14న వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - దర్శి

ఈనెల 14న బాలల దినోత్సవం సందర్భంగా గీతాంజలి డిగ్రీ కళాశాల నందు ప్రకాశం జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కైపు వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎరికి ఇష్టమైన అంశాలో వాళ్లు రాయవచ్చని తెలిపారు. ఈనెల 19న మొదటి మూడు బహుమతులు ఇచ్చి సర్టిఫికేట్లు అందజేస్తారని అన్నారు. ఎస్ఎస్‌సీ పదో తరగతి పాసైన వారు అర్హులని తెలిపారు. వివరాలకు 9381446889, 6303732640 నెంబర్లలో విద్యార్థులు సంప్రదించాలని కోరారు. సంప్రదించాలని అన్నారు.

అల్పాహారం అందిస్తున్న చైర్మన్ జంజనం

నేతాజీ స్ఫూర్తితో సేవలు

ప్రజాశక్తి - చీరాల

నేతాజీ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అన్నారు. పేరాల చిన్నరథం కూడలిలో నేతాజీ సేవా సమితి ఆధ్వర్యంలో అల్పాహారం అందజేశారు. తొలుత నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమం లో సమితి అధ్యక్షుడు చుండూరి కృష్ణ మూర్తి, కార్యదర్శి పవని భాను చంద్ర మూర్తి, రామారావు, సుబ్బారావు, వెంకటేశ్వ రరావు, మణి, ప్రసాదరావు, నాయుడు పాల్గొన్నారు.

నేడు మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

ఆరోగ్య, సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో మండలంలోని గంగవరంలో ఆదివారం బిపి, షుగర్ వ్యాధిగ్రస్తులకు రెగ్యులర్ మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు వేదిక కన్వీనర్ కరి బాలచంద్రం తెలిపారు. మంచాల వెంకటరామయ్య, రంగమ్మ కళ్యాణ మండపంలో శిబిరం జరుగుతుందని తెలిపారు. రెండు నెలలకు సరిపడు మందులు కేవలం రు.200 అందజేస్తారని తెలిపారు. శిబిరానికి డాక్టర్ బోడెంపూడి ప్రకాశ్‌రావు, సీతారావమ్మ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. శిబిరంలో డాక్టర్ మంచాల రమేష్‌కుమార్, డాక్టర్ అన్నం రాజు సాంబయ్య పాల్గొంటారని తెలిపారు.

ఉచితంగా కళ్లజోళ్ల పంపిణీ

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శంకర్ నేత్రవైద్యశాల పెదకాకాని సహకారంతో కంటి శుక్లాల ఆపరేషన్ చేయించుకున్న 100మందికి శంకర్ నేత్రాలయం డాక్టర్లు పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్ళజోళ్ళను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రియా, క్యాంప్ ఆర్గనైజర్ రవికాంత్, రోటరీ అధ్యక్షులు కరి కమలేశ్వరరావు, కార్యదర్శి జెట్టి వెంకటేశ్వర్లు (స్వామి), చుండి సాంబ శివరావు, ఎం హనుమంతరావు, సోమేపల్లి రామమోహనరావు, వి శ్రీమన్నా రాయణ, బత్తుల రామకోటిరెడ్డి పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేస్తున్న దాతలు

సరుకులు అందజేత

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

మండలంలోని నాగండ్లకు చెందిన సోమేపల్లి చక్రపాణి మునిమనుమడు తాటి వేదాన్ష్ మొదటి పుట్టినరోజు సందర్భంగా తల్లిదండ్రులు శ్రీకాంత్, హాశ్విత దంపతులు గంగవరంలోని వృద్ధాశ్రమంలోని వృద్ధులకు రు.5వేల విలువైన నిత్యావసర సరుకులు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు కరి కమలేశ్వరరావు, కార్యదర్శి జెట్టి వెంకటేశ్వర్లు (స్వామి), సోమేపల్లి రామమోహనరావు, వత్సవాయి రాఘవరాజు, వి శ్రీమన్నారాయణ, వి సతీష్, పోపూరి ఝాన్సీరాణి, తాటి శ్రీకాంత్, హాశ్విత పాల్గొన్నారు.

జగన్ వల్ల రాష్ట్రానికి నష్టం : నరేంద్ర వర్మ

ప్రజాశక్తి - బాపట్ల

జగన్ వల్ల రాష్ట్రానికి నష్టం జరిగిందని, అటువంటి ముఖ్యమంత్రి ఆంధ్ర రాష్ట్రానికి అవసరమా అని టిడిపి ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానాన్ని రద్దుచేసి నాలుగు రెట్లు ఇసుక రేట్లు పెంచి భవన నిర్మాణ రంగాన్ని కుప్ప కూల్చారని అన్నారు. 125రంగాల వృత్తిదారులను, అనేక వ్యాపారాలను దెబ్బతీయడంతో సుమారు 30లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు పనులు లేక రోడ్డున పడ్డారని అన్నారు. నవరత్నాల పేరుతో మోసం చేస్తున్నారని అన్నారు. అమ్మఒడికి రూ.13వేలు ఇచ్చి నాన్నకు అందించే మద్యం సీసాల ద్వారా రూ.70వేలు కొట్టేస్తున్నారని వివరించారు. ఆటో డ్రైవర్‌కు రూ.10వేలు ఇచ్చి పెట్రోల్ టాక్సులు, పోలీసు జరిమానాలతో రూ.లక్ష కొట్టేస్తున్నారని అన్నారు.

టీడీపీ కండువా కప్పుకున్న వైసిపి నాయకులు

టిడిపి ఇన్‌చార్జి వేగేశన నరేంద్ర వర్మ పద్ధతికి ఆకర్షితులైనట్లు బేతపూడికి చెందిన దేవర ప్రసాదు, దేవర రామయ్య పేర్కొన్నారు. కార్యకర్తలకు అండగా, భరోసానిస్తూ, నిరుపేదలను ఆదుకుంటూ తమదైన శైలిలో నియోజకవర్గంలో వివిధ కార్యక్రమాలు చేస్తున్నారని నరేంద్రవర్మను అభినందించారు. వైసీపీ నుండి టిడిపిలో చేరిన వారిలో చంద్ర, కె శరత్, కె సునీత, వైసిపి వార్డు మెంబరు కె మౌనిక ఉన్నారు. తమ సామాజిక వర్గానికి చెందిన బాపట్ల మండల పరిషత్ అధ్యక్షులుగా చిన్నపోతుల హరిబాబు కొనసాగు తున్నారని అన్నారు. టీడీపీలో చేరిన వారంతా ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారు కావడం గమనార్హం. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ముక్కామల శివ, చందోలు టిడిపి నాయకులు ఖాసిం, అహ్మద్, కర్లపాలెం టిడిపి నాయకులు బాజీ, చెన్నుబోయిన కిషోర్, సాంబయ్య పాల్గొన్నారు.

వైసిపి నుండి టిడిపిలో కండువాలు వేసి ఆహ్వానిస్తున్న నరేంద్రవర్మ

తెలుగు మహిళల పాదయాత్ర

ప్రజాశక్తి - పర్చూరు

తెలుగు మహిళ ఆధ్వర్యంలో మండలంలోని తిమ్మరాజుపాలెం నుండి శనివారం పాదయాత్ర నిర్వహించారు. చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసుల నుండి బయటపడాలని స్థానిక బొమ్మల సెంటర్ వరకు పాదయాత్ర నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలుగు మహిళ గోరంట్ల విజయలక్ష్మి సర్పంచ్ ఎం ఖాజాబీ, బాచిన విజయలక్ష్మి, నర్రా శిరీష, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు నర్రా రామయ్య, గోరంట్ల రామకృష్ణ పాల్గొన్నారు.

పాదయాత్ర చేస్తున్న మహిళలు

కొండయ్య ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చీరాల

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంటి వద్ద ఉంటున్న టిడిపి బీసీ సెల్ కార్యదర్శి రావూరి శేషగిరికి టిడిపి ఇన్చార్జ్ ఎంఎం కొండయ్య రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ ఆర్థిక మొత్తాన్ని టిడిపి బీసీ సెల్ అధ్యక్షులు అంగిరేకుల వెంకటేశ్వరరావు అందించారు. కార్యక్రమంలో విన్నకోట జగదీష్, ప్రధాన కార్యదర్శి కోసూరి శ్రీనివాసరావు, పోస హరిబాబు, గోసాల శ్రీనివాసరావు, వంగపాటి నరసింహారావు, భువనగిరి గురునారాయణ పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం చేస్తున్న నేతలు

విద్యతోనే దేశ భవిష్యత్తు

మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సభలో కోన రఘుపతి

మౌలాన అబుల్ కలాంకు నివాళి అర్పిస్తున్న కోన రఘుపతి

తొలి విద్యాశాఖ మంత్రి అబుల్ కలాంకు అద్దంకిలో నివాళి

ప్రజాశక్తి - బాపట్ల

దేశంలో విద్యా రంగం అభివృద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన సేవలు చిరస్మరణీయమని ఎంఎల్ఎ కోన రఘుపతి అన్నారు. కలెక్టరేట్‌లోని స్పందన హాలులో అబుల్ కలాం ఆజాద్ జయంతిని శనివారం నిర్వహించారు. అంజుమన్ కమిటీ ముస్లిం నాయకులతో కలిసి ఆజాద్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. దేశంలో మారుమూల ప్రాంతాలకు సైతం వినూత్న రీతిలో విద్యను అందించాలనే లక్ష్యంతో ఆజాద్ అందించిన సేవలు నిరుపమానమని కొనియాడారు.ఆయన జన్మదినాన్ని జాతీయ విద్యా దినోత్సవంగా ప్రభుత్వం నిర్వహిస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఆర్డిఓ జి రవీందర్, కలెక్టరేట్ ఎఒ కె గోపికృష్ణ, అంజుమన్ కమిటీ అధ్యక్షులు షేక్ జిలాని, ఉపాధ్యక్షులు షేక్ ఇమామ్ హుస్సేన్ పాల్గొన్నారు.

సంతమాగులూరు : స్థానిక శాఖ గ్రంథాలయం నందు భారత తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు గ్రంథపాలకులు బాదం విజయ భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి పూల దండలు వేసి నివాళులు అర్పించారు.

బాపట్ల : పాఠశాల తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు ఉందనే సూక్ష్మాన్ని గ్రహించి, విద్య యొక్క ఔన్నత్యాన్ని చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి మౌలానా ఆజాద్ అని కాంగ్రెస్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు పఠాన్ రాజేష్ అన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ 135వ జయంతిని కాంగ్రెస్ అధ్యక్షులు గంట అంజిబాబు సూచనల మేరకు స్థానిక అంబేద్కర్ భవన్‌లో మౌలానా చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దోనేపూడి రవి, నక్కల రాంబాబు, బక్కా రోశయ్య, శీలం సాగర్, బాషా పాల్గొన్నారు.

అద్దంకి : భారత తొలి విద్యాశాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ జీవితం ఆదర్శంగా తీసుకోవాలని కెఆర్‌కె డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి మోహనరావు సూచించారు. ఆజాద్ పుట్టినరోజు సందర్భంగా కళాశాల ఆడిటోరియంలో చిత్రపటానికి నివాళులర్పించారు. వ్యాసరచన, వక్తృత్య పోటీలో విజేత లైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

బాపట్ల రూరల్ : భారతదేశ విభజనను పూర్తిగా వ్యతిరేకించిన మహోన్నత దేశభక్తుడు అబుల్ కలాం ఆజాద్ అని షేక్ పీర్ అన్నారు. స్థానిక జమేదారుపేటలో ముస్లిం ప్రగతి వేదిక ఆధ్వర్యంలో శనివారం అబుల్ కలాం ఆజాద్ 135వ జయంతి సభ నిర్వహించారు. తొలి విద్యాశాఖ మంత్రిగా నిర్బంధ ప్రాథమిక విద్యను, ఐఐటీలను యుజిసి గ్రాంట్స్ కమిషన్ను నెల కొల్పారని అన్నారు. ఈ సభలో సాబ్జాన్, బాషిద్, ఇలాహి బాబావాలి, కలాం ఖాజా, కరీముల్లా తదితరులు ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

బాపట్ల : దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి వేడుకలను డిఎస్పీ కార్యాలయంలో డిఎస్పి టి వెంకటేశులు ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ యు శ్రీనివాసులు, వెల్ఫేర్ ఆర్ఐ బి శ్రీకాంత్ నాయక్, అడ్మిన్ ఆర్ఐ ఎల్ మన్మధరావు పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాంకు నివాళి అర్పిస్తున్న బాపట్ల డిఎస్‌పి

జగనన్న కాలనీ ఇళ్లను పరిశీలిస్తున్న ఎంపిడిఒ స్వరూపరాణి

గృహ నిర్మాణాలను పూర్తి చేయాలి

ప్రజాశక్తి - చిన్నగంజాం

అసంపూర్తిగా నిర్మించిన గృహాలను వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీఒ కె స్వరూపారాణి సూచించారు. మండలంలోని రాజుబంగారుపాలెం, పల్లెపాలెం, కొత్తపాలెం పంచాయతీలోని జగనన్న కాలనీల లే ఔట్ల లబ్ధిదారులతో శనివారం మాట్లాడారు. డిఆర్డిఏ ద్వారా లబ్ధిదారులకు అవసరమైన ఆర్థిక వనరులు చేకూరుస్తున్నట్లు తెలిపారు. త్వరితగతిన నిర్మాణం చేసుకునేలా ప్రోత్సహించాలని సిబ్బందికి సూచించారు. ఈఓఆర్డి ఎన్ గోపాలకృష్ణమూర్తి, హౌసింగ్ ఏఈ రాజశేఖర్ పాల్గొన్నారు.

కార్యకర్తల సమావేశంలో ఎంపి మోపిదేవి వెంకటరమణ

కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలి

ప్రజాశక్తి - రేపల్లె

సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోనికి విస్తృతంగా తీసుకొని వెళ్లాలని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు కార్యకర్తలను ఆదేశించారు. పట్టణంలోని శ్రీ సీతారామ యోగిని కళ్యాణ మండపంలో బూత్ కన్వీనర్లు, ఏజెంట్లు, గృహ సారదులకు అవగాహన సమావేశం శనివారం నిర్వహించారు. గృహ సారథులు, బూత్ కన్వీనర్లు, గ్రామ స్థాయి నాయకులు సమిష్టిగా కృషి చేసి జగన్మోహన్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. అర్హత కలిగి సంక్షేమ పథకాలు అందని వారెవరైనా ఉంటే గుర్తించి పథకాలందే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామాల్లో ప్రజల మధ్య స్నేహపూర్వక వాతావరణ నెలకొల్పి వైసిపి అభివృద్ధికి సహకరించే విధంగా కృషి చేయాలని కోరారు. రానున్న ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.ః

టిడిపిలోకి 50 మంది..

ప్రజాశక్తి - బాపట్ల

నియోజకవర్గంలో ఎస్టీలు టిడిపిలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. శనివారం ఒక్కరోజే బాపట్ల మండలం చిన్నబేతపూడికి చెందిన ఎస్టి (ఎరుకల) నరేంద్ర వర్మ ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. కర్లపాలెం మండలం బుద్దాం గ్రామంలో వైసిపికి చెందిన ఎస్టి (యానాదులు) 50మంది టిడిపిలో చేరి పసుపు కండువాలు కప్పుకున్నారు. బలహీన వర్గాల ఓటర్లు టిడిపిలో చేరడంపై నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. కర్లపాలెం మండలం బుద్దాం గ్రామానకి చెందిన ఎస్టి యానాది కాలనీ 50కుటుంబాలు నర్రా వెంకటస్వామి (ముసలయ్య), కాకర్లపూడి భాస్కరరాజు ఆధ్వర్యంలో టిడిపిలో చేరి నరేంద్రవర్మకు మద్దతు ప్రకటించారు. నాలుగున్నరేళ్ళ వైసిపి పాలనలో ఎస్టీల్లో యానాదుల అభివృద్ధికి సిఎం జగన్మోహన్‌రెడ్డి చేసిందేమీ లేదని, ఇంకా చేస్తాడనే ఆశ కూడా సన్నగిల్లి టిడిపిలో చేరినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నర్రా ఏడుకొండలు, కొమరగిరి సూరిబాబు, అంకమ్మ, ఇండ్ల వెంకటేశ్వర్లు, కొండలు, కొమరగిరి శ్రీనివాసరావు, కొమరగిరి పోతురాజు, హనుమంతరావు, కొమరగిరి శ్రీను, తలపల పోలేరు, మన్నెం రమారావు, చేవూరి ఏడుకొండలు, శెవూరి రాఘవ, పులి వెంకటేశ్వర్లు, కత్తి ముసలయ్య, కత్తి హరిబాబు, కొమరగిరి సుబ్బారావు, ఇండ్ల శ్రీనివాసరావు, కొమరగిరి ఏడుకొండలు, కొమరగిరి వెంకటేశ్వర్లు, కత్తి వెంకటేశ్వర్లు, కొమరగిరి ప్రభు పాల్గొన్నారు.

దుర్మార్గపు పాలనకు బుద్ధి చెప్పాలి

టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

ఉగ్ర నరసింహారెడ్డికి హారతులిస్తున్న మహిళలు

ప్రజాశక్తి-కనిగిరి

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు, వైసిపి దుర్మార్గపు పాలనపై ప్రజా చైతన్యం కలిగించేందుకు 'మన ఊరు..మన ఉగ్ర' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ కనిగిరి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలియజేశారు. శనివారం రాత్రి పోలవరంలో, ఉదయం కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని కొత్తూరు, ఆర్టీసీ డిపో ప్రాంతంలో మన ఊరు మన ఉగ్ర కార్యక్రమం కొనసాగగా ఆయన పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. బాబుతో నేను కరపత్రాలు పంపిణీ చేస్తూ చంద్రబాబు అక్రమ అరెస్టు గురించి ప్రజలకు వివరించారు. ప్రజలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కనిగిరి మండల అధ్యక్షులు నంబుల వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు రాచమల్ల శ్రీనివాస్ రెడ్డి, ముచ్చుమారి చెంచిరెడ్డి, షేక్ ఫిరోజ్, షేక్ అహ్మద్,తమ్మినేని వెంకటరెడ్డి, చింతలపూడి తిరుపాలు, నంబుల కొండయ్య,బాలు ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజారక్షణభేరి సభను జయప్రదం చేయండి

సిపిఎం ఆధ్వర్యంలో కరపత్ర ప్రచారం

కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ప్రజాసమస్యల పరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 15న విజయవాడలో జరిగే ప్రజా రక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చీకటి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ప్రజారక్షణభేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో శనివారం స్థానిక తొమ్మిదో డివిజన్ పులివెంకటరెడ్డి కాలనీలో కరపత్ర ప్రచారం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకునేందుకు సిపిఎం ఆధ్వర్యంలో ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్రలు జరుగుతున్నాయని, అన్ని బస్సుయాత్రల ముగింపు సందర్భంగా ఈ నెల 15న విజయవాడలో భారీ బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు అత్తింటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎన్నికలలో టిడిపి గెలుపు అత్యవసరం

రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల

'జనం కోసం జనార్ధన్' కార్యక్రమంలో దామచర్ల

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలో 2024లో జరగబోయే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ గెలుపు అత్యవసరమని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు తెలిపారు. జనం కోసం జనార్ధన్, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకి గ్యారెంటీ కార్యక్రమం శనివారం ఒంగోలు నగరంలోని 50వ డివిజన్ ఎన్జీవో కాలనీ, ఒంగోలు మండలం మండువారిపాలెం పంచాయతీతో నిర్వహించారు. కార్యక్రమం లో భాగంగా టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఒంగోలు మాజీ శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు ఇంటింటికి వెళ్లి మహిళలు, యువతతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. డివిజన్ లో మినీ మేనిఫెస్టో కరపత్రాలను అందజేసి తెదేపా అధికారంలోకి వస్తే అమలు చేయబోయే సంక్షేమ పథకాలను వివరించారు. దామచర్ల జనార్ధన్‌రావు మాట్లాడుతూ చంద్రబాబు ఒక విజన్ ఉన్న నాయకుడని..రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలంటే ఆయన మళ్లీ ముఖ్యమంత్రి కావాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో తెదేపా గెలుపు అత్యవసరమని, టిడిపి గెలుపుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మంత్రి శ్రీనివాసరావు, కొఠారి నాగేశ్వరావు, నల్లమోతు గంగాధర్, పోలవరపు వెంకట రామయ్య, కామేపల్లి శ్రీనివాసరావు, బండారు మదన్, కారుమూడి గోపి, సోమిశెట్టి శ్రీనివాసులు, నావూరి కుమార్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలువ పూడికతీత పనులు పరిశీలన

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

పారిశుధ్య పనులు పర్యవేక్షణలో భాగంగా నగరపాలక సంస్థ కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు శుక్రవారం నగరంలోని ఇస్లాంపేట సచివాలయం పరిధిలో పర్యటించారు. ఆ ప్రాంతంలో చేపట్టిన డ్రెయినేజీ పూడిక తీత పనులు పరిశీలించారు. ప్రతి రోజు చెత్త సేకరణ చేయాలని, మురుగు కాల్వలను శుభ్రంగా ఉంచాలని, పారిశుధ్య సిబ్బందికి సూచించారు. ప్రజలు వ్యర్థాలను రోడ్లమీద, కాల్వల్లో వేయకుండా చెత్త ఆటోలకు అందించాలని విజ్ఞప్తి చేశారు. తరువాత కమిషనర్ ఇందిర్మనగర్, ఒకటో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ప్రాంతాల్లో జరుగుతున్న డ్రెయినేజీ శుభ్రత పనులను పరిశీలించారు. కమిషనర్ వెంట నగరపాలక సంస్థ డిఈఈలు రఘురాం, గణపతి, శానిటరి ఇన్స్‌పెక్టర్లు వెంకటేశ్వర్లు, శ్రీను, తదితరులు ఉన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలి

సిపిఎం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

నిరసన ర్యాలీనుద్దేశించి మాట్లాడుతున్న కేశవరావు

ప్రజాశక్తి-కనిగిరి

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని, భారత ప్రభుత్వం పాలస్తీనాకు సంఘీభావం ప్రకటించాలని కనిగిరి పట్టణములో శనివారం సిపిఎం ఆధ్వర్యంలో సంఘీభావ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం కనిగిరి కార్యదర్శి పిసి.కేశవరావు మాట్లాడుతూ ఇజ్రాయిల్ పాలిస్తీనాపై అక్రమంగా దాడి చేయడానికి తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్కే బషీర్, ప్రసన్న, ప్రజాసంఘాల నాయకులు నరేంద్ర, కొండలు, శాంతకుమారి, వెంకటమ్మ, వెలిశమ్మ, పిచ్చయ్య పాల్గొన్నారు.

ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎఎస్పీ

అబుల్ కలాం ఆజాద్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ 135వ జయంతి సందర్భంగా ఎస్పీ మలిక గర్గ్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, పోలీస్ అధికారులు శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చాక భారత ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రిగా 11 సంవత్సరాల పాటు పనిచేశాడని, దేశ స్వాతంత్ర్య పోరాటంలో, విద్యారంగం బలోపేతానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, భారత రత్న అవార్డుతో సత్కరించబడ్డారని కొనియాడారు. ఆయన పుట్టినరోజును జాతీయ విద్యా దినోత్సవంగా మరియు మైనారిటీల సంక్షేమ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, డిఎస్‌బి డీఎస్పీ బి.మరియాదాసు, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వర్లరావు, డిసిఆర్‌బి సిఐ ధర్మేంద్ర బాబు, ఆర్‌ఐ హరిబాబు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

13న స్పందన తాత్కాలికంగా రద్దు

ప్రజాశక్తి-ఒంగోలు

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ఈ నెల 13న తాత్కాలికంగా రద్దు చేసినట్లు కలెక్టరేట్ పరిపాలన అధికారి చిరంజీవి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నవంబరు 13న దీపావళి పండుగ సందర్భంగా సెలవుగా పరిగణిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఆ రోజున నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని, దూర ప్రాంతాల నుంచి ఎవరూ ఒంగోలుకు రావద్దని ఆయన సూచించారు.

'ఎస్పీ స్పందన' కూడా..

ప్రకాశం జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించే 'స్పందన' కార్యక్రమాన్ని ఈ నెల 13న తాత్కాలికంగా రద్దు చేసినట్లుగా ప్రకాశం జిల్లా ఎస్పీ మలికగర్గ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నవంబరు 13న దీపావళి పండగ సందర్భంగా సెలవుగా పరిగణిస్తూ, ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయడంతో నవంబరు 13న నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు, ఈ విషయాన్ని ప్రజలు గమనించవలసిందిగా జిల్లా ఎస్పీ తెలిపారు.

ప్రజల కోసమే 'ప్రజారక్షణ భేరి'

సిపిఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర ఈ నెల 7, 8 తేదీల్లో ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో సాగింది. ఈ సందర్భంగా పలు చోట్ల జరిగిన బహిరంగ సభల్లో నేతలు ప్రసంగించారు. అధికార, ప్రతిపక్ష నేతలందరూ ఎవరికి వారే రాజకీయ స్వార్థంతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి భజన చేస్తూ ఉన్నారని, ఇదే అదునుగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై పన్నుల భారాలను మోపుతున్న విధానాల గురించి సిపిఎం నేతలు ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించారు. రాష్ట్ర ప్రయోజనాలను విస్మరించి కేంద్ర ప్రభుత్వం కొమ్ముకాస్తున్న వైసిపి, టిడిపి, జనసేన పార్టీలను ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు.

ప్రజారక్షణ భేరి బస్సు యాత్రలో భాగంగా స్థానికంగా ఉన్న పలు సమస్యలపై ప్రజాసంఘాల వారు, ప్రజలు సిపిఎం నేతలకు వినతిపత్రాలు అందజేశారు. ప్రధానంగా జిల్లాలోని పలు మండలాల్లో ఉన్న కరువు పరిస్థితులు, అంగన్‌వాడీల సమస్యలు, మున్సిపల్ కార్మికుల సమస్యలు, ఇళ్లస్థలాల సమస్యలు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను, అసైన్డ్ భూముల సమస్యలను సిపిఎం నేతల దృష్టికి తీసుకెళ్లారు. వెలిగొండ ప్రాజెక్టు, కొరిశపాడు ఎత్తిపోతల పథకం, గుండ్లకమ్మ రిజర్వాయర్ దుస్థితి, ఇసుక అక్రమ తరలింపులు తదితర అంశాలను స్థానికులు సిపిఎం నేతల ముందు పెట్టారు. అన్ని అంశాలనూ కూలంకషంగా పరిశీలించిన సిపిఎం నేతలు సమస్యల పరిష్కారం కోసం పోరాటం తప్పదన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15న సిపిఎం నేతృత్వంలో విజయవాడలో జరుగనున్న ప్రజా గర్జనభేరి బహిరంగ సభలో ప్రజలందరూ పాల్గొని సిపిఎంకు మద్దతు తెలపాలని కోరారు.

వర్షాలు లేక ఇబ్బందులు పడుతున్న రైతులకు ఇటీవల పడిన కొద్దిపాటి వర్షాలు ఊరటనిచ్చాయి. ఆలస్యంగా వేసిన వరి పైరుకు జీవం పోసిన వర్షాలు ముందుగా నాట్లు వేసిన ప్రస్తుతం పొట్ట, కంకి దశలో ఉన్న వరి పైరుకు ఒకింత కష్టాన్ని, నష్టాన్ని కలిగించాయి. అనావృష్టి కారణంగా కొందరు రైతులు, కంకి దశలో వరి ఉన్న రైతులు నష్టపోయే పరిస్థితులు తలెత్తాయి. చీరాల,కారంచేడు, చినగంజాం ప్రాంత వరిపైర్లకు ఈ వర్షం వల్ల మేలు జరగ్గా, వేమూరు, కొల్లూరు, బట్టిప్రోలు, అమర్తలూరు మండలాల్లో పలుచోట్లకురిసిన వర్షాలకు వరి పైరు నేలకు వాలడంతో వరి కంకి తాలుగా మారే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గింజ పాలు పోసుకోకముందే పడిపోతే కోతకొచ్చే సమయానికి మరింత నేల వాలే ప్రమాదం కూడా ఉందని, దీని వల్ల రైతులకు నష్టం జరిగే అవకాశాలున్నట్లు చెబుతున్నారు. ఇలా వర్షం కొందరికి మోదం.. మరి కొందరికి ఖేదం అయ్యింది.

అధికారం అండగా ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా యధేశ్చగా సాగుతున్నాయి. ఇసుక అక్రమ తవ్వకాలపై ఉక్కు పాదం మోపుతున్నట్లు అధికారులు చెప్పడమే తప్ప ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదు. ముఖ్యంగా బాపట్ల జిల్లాలోని సముద్ర తీర ప్రాంతం నుంచి ఇసుక రేవులు, అసైన్డ్ భూముల నుంచి అనుమతి లేకుండా ఇసుక తవ్వకం యథేచ్ఛగా జరుగుతోంది. ప్రభుత్వ భవనాలు, పక్కా గృహాలు, నాడు-నేడు పాఠశాలల అభివృద్ధి పనుల కోసం ఇసుక తవ్వకాలకు అనుమతులు ఉన్న నేపథ్యంలో దీనిని అడ్డుగా పెట్టుకుని ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. చీరాల మండలంలోని కాపూరివారిపాలెం పొలాల్లో ఇసుక అక్రమ తవ్వకాలను అక్కడి రైతులు సిపిఎం నేతల అండతో అడ్డుకున్నారు. రాత్రుళ్లు కాపలాలు కాసినా ఇసుక రవాణాను అడ్డుకోవడం కష్టమవుతోంది. అధికార పార్టీ నేతలు సదరు అక్రమదారులకు అండగా ఉంటున్నారు. ఇటీవల జిల్లాలోని కర్లపాలెం మండలంలో 27 క్యూబిక్ మీటర్ల ఇసుక అక్రమంగా తవ్వకాలు జరిపినట్లు గుర్తించి బాధ్యులకు అధికారులు రూ.1.40 కోట్ల మేర జరిమానా విధించినట్లు చెబుతున్నారు. జిల్లాలో అధికారికంగా ఇసుక అనుమతుల కోసం రెండు ఇసుక రేవుల్లో తవ్వకాలకు అనుమతులపై జిల్లా స్థాయి కమిటీ ఇటీవల ఆమోదముద్ర వేసింది. కొల్లూరు మండలం గాజులంక గ్రామంలో 49,499 క్యూబిక్ మీటర్లు, కొల్లూరు మండలం జువ్వలపాలెం గ్రామంలోని ఇసుక రేవు నుంచి 49,600 క్యూబిక్ మీటర్లు తవ్వకాలకు అనుమతులిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే అనుమతులున్న చోట గాకుండా మిగిలిన ప్రాంతాలలో ఇసుక అక్రమంగా తవ్వితే కఠినమైన చర్యలు తీసుకునే పరిస్థితులు లేవు.

ఇటీవల పలు అంశాల్లో పోలీసులు అనుసరిస్తున్న వైఖరి వివాదాస్పదమవుతోంది. వరుసపెట్టి పోలీస్ అధికారులు సస్పెన్షన్‌కు గురవుతున్నారు. పర్చూరు నియోజకవర్గంలో ఫారం-7 దరఖాస్తుల విషయమై నేరుగా జోక్యం చేసుకున్నారన్న ఆరోపణలపై మార్టూరు సిఐ, ముగ్గురు ఎస్ఐలను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. అంతకుముందు అద్దంకి సిఐపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో వీఆర్‌కు వెళ్లారు. చుండూరు పోలీస్‌స్టేషన్‌లో గోవింద్ నుంచి రూ.45 వేలు లంచం తీసుకుంటూ అక్కడి ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు ఏసిబికి చిక్కి సస్పెండ్ అయ్యారు. ఈ కేసులో అక్కడి సిఐపైనా అధికారులు క్రమశిక్షణా చర్యలు తీసుకోనున్నారు.

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైసిపి, టిడిపి నేతలు ప్రజలను కలిసేందుకు పలు కార్యక్రమాలతో వస్తున్నారు. వైసిపి వారు ప్రస్తుతం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనన్న ఎందుకు కావాలంటే..' అనే కార్యక్రమంతో ప్రజలను కలుస్తున్నారు. టిడిపి వారు గ్రామపంచాయతీల వారీగా మన పల్లెకు అనే కార్యక్రమం, సైకిల్ ర్యాలీలు జరుపుతున్నారు. గ్రామాల్లో ఇంటింటికి తిరిగి తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలను ఎత్తేశారని, ప్రతిపక్ష పార్టీ ఓట్లను తొలగించేందుకు కుట్రలు పన్నుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలియజేస్తున్నారు.

- ప్రజాశక్తి, బాపట్ల జిల్లా